# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శుక్రవారం-15- ఆగస్టు - 2025 | సంపుటి : 3 | సంచిక : 80 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## మా నీటిని అడ్డుకుంటే.. యుద్ధమే



సింధు జాలాల విషయంలో పాకిస్తాన్ మరోసారి భారత్ కు వార్నింగ్ ఇచ్చింది. అమెరికా పర్యటన సందర్భంగా పాక్ ఆర్మీ చీఫ్ భారత్ పై అణు బెదిరింపు వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. భవిష్యత్తులో భారత్ నుండి తమ దేశం ఉనికికి ముప్పును ఎదురైతే.. పాకిస్తాన్, భారత్ తోపాటు సగం ప్రపంచాన్ని నాశనం చేస్తామని హెచ్చరించాడు. తాజాగా పాక్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ కూడా భారత్ ను హెచ్చరించాడు. తమ దేశానికి హక్కుగా చెందిన ఒక్క చుక్క నీటిని కూడా భారత్ ను తీసుకోనివ్వమని ప్రతిజ్ఞ చేశారు. ఇస్లామాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాన మంత్రి షరీఫ్ మాట్లాడుతూ.. తమకు దక్కాల్సిన నీటిని ఆపడానికి భారత్ ప్రయత్నిస్తే.. యుద్ధ చర్యగా పరిగణిస్తామని హెచ్చరించాడు. మీరు మా నీటిని నిలిపేస్తామని బెదిరిస్తే, మీరు పాకిస్తాన్ నుండి ఒక్క చుక్కను కూడా లాక్కోలేరని గుర్తుంచుకోండి. భారత్ అలాంటి చర్యకు ప్రయత్నిస్తే.. తగిన గుణపాఠం నేర్పుతాం'' అని హెచ్చరించాడు. కాగా.. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రవాద దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఉగ్రదాడి నేపథ్యంలో భారత ఆర్మీ.. పాకిస్థాన్ లోని ఉగ్రవాదుల శిభిరాలను మిస్సైల్స్ తో ధ్వంసం చేసింది. అలాగే, ఉగ్రవాదులకు పాక్ సహకరిస్తుందని.. సింధు నది జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసింది.



## పాక్ స్వాతంత్ర్య వేడుకల్లో విషాదం..

పాకిస్థాన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. దేశ ఆర్థిక రాజధాని కరాచీలో సంబరాల్లో భాగంగా కొందరు నిర్లక్ష్యంగా గాల్లోకి జరిపిన కాల్పుల కారణంగా ఎనిమిదేళ్ల బాలిక సహా ముగ్గురు అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనల్లో 60 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఈ దారుణ ఘటనలతో నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడిరది. స్థానిక మీడియా కథనాల ప్రకారం, ఆగస్టు 14న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అర్ధరాత్రి దాటిన తర్వాత కరాచీ నగరం తుపాకీ మోతలతో, బాణసంచా చప్పుళ్లతో దద్దరిల్లింది. ఈ క్రమంలో అజీజాబాద్ బ్లాక్ 8 ప్రాంతంలో ఆడుకుంటున్న ఎనిమిదేళ్ల చిన్నారిపైకి ఓ తూటా దూసుకువచ్చింది. తీవ్రంగా గాయపడిన ఆ బాలికను ఆస్పత్రికి తరలించేలోపే ప్రాణాలు కోల్పోయింది. మరో ఘటనలో కోరంగి ప్రాంతంలో స్టీఫెన్ అనే వ్యక్తిపైకి తూటా దూసుకెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. నగరంలోని మరో ప్రాంతంలోనూ ఇలాంటి కాల్పులకే ఓ వృద్ధుడు బలైనట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనల్లో మొత్తంగా 64 మందికి బుల్లెట్ గాయాలైనట్లు రెస్క్యూ సిబ్బంది వెల్లడిరచారు. క్షతగాత్రులను నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. లియాఖతాబాద్, కోరంగి, లయారి, నార్త్ నాజిమాబాద్ సహా నగరంలోని అనేక ప్రాంతాల్లో ఈ కాల్పుల ఘటనలు నమోదయ్యాయి. సంబరాల పేరుతో గాల్లోకి కాల్పులు జరపడాన్ని అధికారులు తీవ్రంగా ఖండిరచారు. ఇది అత్యంత ప్రమాదకరమని, బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. పౌరులు సురక్షితమైన పద్ధతుల్లో వేడుకలు జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనల నేపథ్యంలో పోలీసులు నగరవ్యాప్తంగా దాడులు నిర్వహించి, 20 మంది అనుమానితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలపై దర్యాప్తు కొనసాగుతోందని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## దక్షిణ యూరప్‌లో కార్చిచ్చు ..



దక్షిణ యూరప్‌లో కార్చిచ్చు మరింత తీవ్రమైంది. ఈ కార్చిచ్చులతో స్పెయిన్, టర్కీ, అల్బేనియాల్లో ముగ్గురు మరణించినట్లు అధికారులు బుధవారం తెలిపారు. గ్రీస్‌లోని మూడవ అతిపెద్ద నగరం పాట్రాస్‌ను మంటలు చుట్టుముట్టకుండా అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా యత్నిస్తున్నారు. పాట్రాస్ వెలుపల, ఆలివ్ తోటల్లోకి మంటలు వ్యాపించాయి. ఇళ్లు, వ్యవసాయ సదుపాయాలను రక్షించేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. హెలికాప్టర్లు, విమానాలతో మంటలపై నీటిని జల్లుతున్నారు. నరికివేసిన కొమ్మల మంటలను నివాసితులు బకెట్లతో నీటితో ఆర్పేందుకు యత్నిస్తున్నారు. గత కొన్ని రోజులుగా మధ్యధరా ఐరోపా అంతటా వేడిగాలులు, అధిక ఉష్ణోగ్రతలతో ఈ ప్రాంతాల్లో అగ్నిమాపక యంత్రాలు తగ్గాయి. పశ్చిమ గ్రీకులోని పాట్రాస్ మరియు జాకింథోస్ ద్వీపంలో డజన్ల కొద్దీ చెలరేగిన కార్చిచ్చులపై విమానాలతో నీళ్లను స్ప్రే చేస్తున్నారు. ఏథేన్స్ పొరుగున ఉన్న అల్బేనియాకు కూడా అగ్నిమాపక యంత్రాలను పంపినట్లు అధికారులు తెలిపారు. రాజధాని టిరానాకు దక్షిణాన జరిగిన అగ్ని ప్రమాదంలో 80 ఏళ్ల వృద్ధుడు మరణించాడని అన్నారు. మధ్య అల్బేనియాలో ఆర్మీకి చెందిన మందుగుండు సామాగ్రి డిపో సమపంలోని నాలుగు గ్రామాలను ముందు జాగ్రత్తగా ఖాళీ చేయించారు. మాడ్రిడ్‌కు ఉత్తరాన ఉన్న కాస్టిల్ మరియు లియోన్ ప్రాంతం నుండి వేలాది మందిని తరలించారు. ఈ ప్రాంతంలో అగ్నిమాపక దళానికి చెందిన స్వచ్ఛంద సేవకుడు ఒకరు మరణించాడు. దక్షిణ టర్కీలో కార్చిచ్చును అదుపు చేసేందుకు యత్నిస్తుండగా అగ్నిమాపక వాహనం ఢీకొనడంతో ఒక అటవీ కార్మికుడు మరణించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో మరో నలుగురు గాయపడ్డారని అటవీ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈఏడాది జూన్ నెల చివరి నుండి టర్కీ కార్చిచ్చులను ఎదుర్కొంటోంది. పది మంది సహాయక వాలంటీర్లు, అటవీ కార్మికులు సహా మొత్తం 18మంది మరణించారు.

# మాస్కోలో జైశంకర్, లావ్రోవ్ భేటీకి రంగం సిద్ధం



భారత్, రష్యా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతోంది. ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయి సమావేశాలు, పర్యటనలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలోనే భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ మధ్య మరో కీలక భేటీ జరగనుంది .ఈ నెల ఆగస్టు 21న మాస్కోలో వీరిద్దరూ సమావేశం కానున్నారు. ఈ విషయాన్ని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం అధికారికంగా ధృవీకరించింది. ద్వైపాక్షిక ఎజెండాలోని ముఖ్యమైన అంశాలతో పాటు, అంతర్జాతీయ వేదికలపై సహకారం గురించి ఇరువురు నేతలు చర్చిస్తారని ఒక ప్రకటనలో తెలిపింది.ఇటీవల భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మాస్కోలో పర్యటించిన కొద్ది రోజులకే ఈ సమావేశం జరగనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. తన పర్యటనలో దోవల్ర ష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగు, ఇతర ఉన్నతాధికారులతో భేటీ అయ్యారుగత కొంతకాలంగా జైశంకర్, లావ్రోవ్ పలు వేదికలపై సమావేశమవుతూనే ఉన్నారు. గత నెలలో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా, జూలై 15న జరిగిన షాంఘై సహకార సంస్థ విదేశాంగ మంత్రుల సమావేశం సందర్భంగా కూడా వీరిద్దరూ చర్చలు జరిపారు. పశ్చిమాసియా, బ్రిక్స్, ఎస్‌సీఓ వంటి అంశాలతో పాటు ద్వైపాక్షిక సహకారంపై మంతనాలు జరిపారు.ఈ ఏడాది మార్చి 7న భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సైతం మాస్కోలో పర్యటించి రష్యా డిప్యూటీ విదేశాంగ మంత్రితో సంప్రదింపులు జరిపారు. ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయిలో తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతిని సమీక్షించారు.ఇదిలా ఉండగా, ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ త్వరలో భారత్‌లో పర్యటించే అవకాశం ఉంది. ఇరు దేశాల నేతల మధ్య వార్షిక సమావేశాల సంప్రదాయాన్ని కొనసాగించేందుకు ఈ పర్యటనకు సన్నాహాలు జరుగుతున్నాయి.

# గాజాలో మారణహోమాన్ని ఆపాలి




గాజాపై ఇజ్రాయిల్ జరుపుతోన్న మారణహోమానికి వ్యతిరేకంగా అమెరికాలోనూ ఆందోళనలు తీవ్రమవుతున్నాయి. ఇటీవల ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడుల్లో జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోవటం, యూఎస్ బ్లాక్‌అవుట్‌లకు వ్యతిరేకంగా న్యూయార్క్‌లో నిరసనలు వెల్లువెత్తాయి. ఇజ్రాయిల్ చర్యలను ఖండిస్తూ ఆందోళనకారులు ర్యాలీ జరిపారు. గాజాలో మారణహోమాన్ని ఆపాలని వారు డిమాండ్ చేశారు. పాలస్తీనియన్ యూత్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలోవందలాది మంది పాల్గొన్నారు.గాజాలో మహిళలు, చిన్నారులనే తేడా లేకుండా ఇజ్రాయిల్ సైన్యం దారుణంగా ప్రవర్తిస్తున్నది. జర్నలిస్టులను కూడా టార్గెట్ చేసుకుంటూ వారిని చంపేస్తున్నది. మధ్యప్రాచ్యంలో ప్రముఖ వార్త చానెల్ 'అల్ జజీరా'కు చెందిన జర్నలిస్టులు.. గాజాలో ఇజ్రాయిల్ ఇటీవల జరిపిన వైమానిక దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. ఇజ్రాయిల్ చర్యలపై అంతర్జాతీయంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. పలు దేశాలు.. ఇజ్రాయిల్ చర్యను తీవ్రంగా ఖండిరచాయి. ఇదే విషయంపై ఇటు అమెరికాలోనూ ఆందోళనలు జరుగుతోన్నాయి. దాడుల్లో జర్నలిస్టుల ప్రాణాలను తీసుకోవటంపై నిరసనకారులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. గాజాలో ఇజ్రాయిల్ వైఖరికి వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. ప్లకార్డులను ప్రదర్శించారు. ఇజ్రాయిల్‌కు అమెరికా నుంచి అందే సాయాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. న్యూయార్క్‌లో గల ప్రముఖ వార్త సంస్థ 'ది న్యూయార్క్ టైమ్స్' ముందు ఈ నిరసనలు జరిగాయి. ఈ సందర్భంగా అమెరికా మీడియా తీరు పైనా ఆందోళనకారులు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. గాజాలో ఇజ్రాయిల్ జరుపుతోన్న మారణహోమాన్ని యూఎస్ మీడియా కప్పిపుచ్చుతున్నదనీ, వాస్తవాలను బయటకు చెప్పటం లేదని ఆందోళన వెలిబుచ్చారు. గాజాను తాము ఆక్రమించుకోబోమని చెప్తూనే ఇజ్రాయిల్ ఇక్కడ దాడులు జరుపుతున్నది. గాజాకు హమాస్ నుంచి విముక్తి కల్పిస్తామనీ, ఆ సంస్థను అంతం చేస్తామనే సాకుతో నెతన్యాహు ఏకపక్ష చర్యలకు దిగుతున్నారని నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు. తనపై జరుగుతున్న న్యాయ విచారణలు, కేసుల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే గత 22 నెలలుగా నెతన్యాహు గాజాపై యుద్ధాన్ని కొనసాగిస్తున్నారని వివరిస్తున్నారు. అంతర్జాతీయ సమాజం నుంచి ఎంత వ్యతిరేకత వచ్చినా.. అమెరికా అండ చూసుకొనే గాజాపై ఇజ్రాయిల్ తీవ్రంగా రెచ్చిపోతున్నదని విశ్లేషకులు అంటున్నారు.

# భారత్‌పై భారీ సుంకాలు విధించాలన్న ట్రంప్ నిర్ణయంపై జాన్ బోల్టన్ విమర్శలు



అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్‌పై భారీగా సుంకాలు విధించడం ఒక పెద్ద వ్యూహాత్మక తప్పిదమని ఆయన మాజీ జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ తీవ్రంగా విమర్శించారు. ఇది ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీస్తుందని, కీలక భాగస్వామి అయిన భారత్‌ను అనవసరంగా రెచ్చగొట్టడమేనని ఆయన అభిప్రాయపడ్డారు.రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై ట్రంప్ ఏకంగా 50 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఇందులో 25 శాతం కేవలం రష్యా చమురు కొనుగోలుకు జరిమానాగా చేర్చారు. ఈ నిర్ణయాన్ని ట్రంప్ గట్టిగా సమర్థించుకున్నారు. "భారత్ భారీగా రష్యా చమురు కొంటూ, దానిని బహిరంగ మార్కెట్‌లో అమ్మి పెద్ద లాభాలు గడిస్తోంది. రష్యా యుద్ధం వల్ల ఉక్రెయిన్‌లో ఎంత మంది చనిపోతున్నారనే దానిపై వారికి పట్టింపు లేదు'' అని ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఆరోపించారు. అయితే, ట్రంప్ తీరును బోల్టన్ తప్పుబట్టారు. ఓ ప్రముఖ భారతీయ మీడియా సంస్థతో మాట్లాడుతూ, "గత 30 రోజులుగా భారత్ పట్ల వైట్ హౌస్ వ్యవహరించిన తీరు చాలా పెద్ద తప్పు. ఇలాంటి పొరపాట్లు జరిగినప్పుడు దెబ్బతిన్న నమ్మకాన్ని, విశ్వాసాన్ని తిరిగి సంపాదించడానికి చాలా సమయం పడుతుంది'' అని హెచ్చరించారు. రష్యా నుంచి చైనా కూడా చమురు కొనుగోలు చేస్తున్నప్పటికీ, వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కేవలం భారత్‌ను లక్ష్యంగా చేసుకోవడం వెనుక ఉన్న ఉద్దేశాన్ని ఆయన ప్రశ్నించారు.ఈ సందర్భంగా పాకిస్థాన్ విషయాన్ని ప్రస్తావిస్తూ బోల్టన్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇటీవల భారత్‌పాకిస్థాన్ ఉద్రిక్తతల సమయంలో ట్రంప్ జోక్యం చేసుకున్నందుకుగానూ, 2026 నోబెల్ శాంతి బహుమతికి ఆయన పేరును సిఫార్సు చేస్తామని పాకిస్థాన్ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. "ప్రధాని మోదీకి నాదో సలహా.. ఆయన కూడా ట్రంప్ పేరును నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేస్తే బాగుంటుంది'' అని బోల్టన్ చురక అంటించారు. ట్రంప్ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై అమెరికాలోనే తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందనడానికి బోల్టన్ వ్యాఖ్యలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

## 2,800 వీధి కుక్కలను చంపించాం

### జేడీఎస్ ఎమ్మెల్సీ భోజేగౌడ



దేశంలో వీధి కుక్కల సమస్య తీవ్ర రూపం దాల్చుతున్న వేళ, జనతాదళ్ సెక్యులర్ (జేడీఎస్) ఎమ్మెల్సీ ఎస్.ఎల్. భోజేగౌడ చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి. పిల్లల భద్రత కోసం ఏకంగా 2,800 వీధి కుక్కలను చంపించామని, ఇందుకోసం జైలుకు వెళ్లేందుకైనా సిద్ధమని ఆయన శాసనసభలో ప్రకటించడం సంచలనం సృష్టిస్తోంది.చిక్‌మగళూరు స్థానిక సంస్థకు తాను అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఈ ఘటన జరిగిందని భోజేగౌడ తెలిపారు. "మాంసంలో ఓ పదార్థం కలిపి 2,800 కుక్కలకు తినిపించాం. అనంతరం వాటిని కొబ్బరి చెట్ల కింద పాతిపెట్టాం'' అని ఆయన వివరించారు. తమకు జంతువులపై ప్రేమ ఉన్నప్పటికీ, జంతు ప్రేమికులు మరో సమస్యగా మారారని, పిల్లలపై కుక్కల దాడుల వార్తలు చూసి చలించిపోతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వీధి కుక్కల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ వేయాలని ఆయన డిమాండ్ చేశారు.భోజేగౌడ వ్యాఖ్యల నేపథ్యంలో రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఘటనలు మళ్లీ చర్చనీయాంశమయ్యాయి. బెంగళూరులోని అంబేద్కర్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ క్యాంపస్‌లో ఇద్దరు ఎమ్మెల్సీ విద్యార్థులపై, కోడిగేహళ్లిలో 70 ఏళ్ల వృద్ధుడిపై కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. అలాగే, పాత హుబ్బళ్లిలోని షిమ్లా నగర్‌లో మూడేళ్ల బాలికపై కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైంది.ఈ సమస్యపై బృహత్ బెంగళూరు మహానగర పాలిక తీరుపై కర్ణాటక లోకాయుక్త జస్టిస్ బీఎస్ పాటిల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దూకుడుగా ఉండే కుక్కల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలన్న ఆదేశాలను బీబీఎంపీ పట్టించుకోలేదని ఆయన మండిపడ్డారు. మరోవైపు, వీధి కుక్కల అంశం సుప్రీంకోర్టుకు చేరగా, ఈ సమస్యను పరిశీలిస్తామని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ హామీ ఇచ్చారు. ఈ వివాదం జంతు హక్కుల కార్యకర్తలు, పౌరుల మధ్య తీవ్ర చర్చకు దారి తీసింది.

## భారత్ వద్ద బ్రహ్మోస్ ఉన్నాయి..

- **పాక్ ప్రధానికి అసదుద్దీన్ ఓవైసీ కౌంటర్**



సింధు నదీ జలాల నిలిపివేతపై ఇటీవల పాక్ ప్రధాని చేసిన వ్యాఖ్యలపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ.. తనదైన స్టైల్‌లో కౌంటర్ ఇచ్చారు. సింధు జలాల కోసం భారత్‌తో ఎంతవరకైనా పోరాటం చేస్తామని షెహబాజ్ షరీఫ్ కవ్వింపులకు దిగగా..మా వద్ద బ్రహ్మోస్ మిసైల్స్ ఉన్నాయని.. అసదుద్దీన్ ఓవైసీ హెచ్చరించారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దని.. పాకిస్తాన్‌కు ఓవైసీ వార్నింగ్ ఇచ్చారు. ఇక భారత్‌పై పాక్ ఆర్మీ చీఫ్ చేసిన వ్యాఖ్యలను కూడా ఓవైసీ ఖండిరచారు. భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు తగ్గినట్లే తగ్గి.. ఇటీవల మరోసారి తీవ్రం అవుతున్నాయి. పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ సహా ఆ దేశ మంత్రులు, ఇతర నేతలు చేస్తున్న కవ్వింపు వ్యాఖ్యలు.. రెండు దేశాల మధ్య మళ్లీ ఘర్షణ వాతావరణాన్ని నెలకొనేలా చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్.. భారత్‌పై తీవ్రంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం తీవ్ర దుమారం రేపుతోంది. మరోవైపు.. అమెరికా పర్యటనలో ఉన్న పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్.. భారత్‌పై తీవ్ర అక్కసు వెళ్లగక్కిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే భారత్ వద్ద బ్రహ్మోస్ క్షిపణులు ఉన్నాయని.. ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. పాక్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరిగిన ఇంటర్నేషనల్ యూత్ డే సందర్భంగా పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ భారత్‌పై తీవ్రంగా మండిపడిన విషయం తెలిసిందే. సింధు నదీ జలాలను నిలిపేసేందుకు తీసుకునే ఎలాంటి చర్య అయినా.. యుద్ధానికి కవ్వింపు చర్యగా భావించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పాకిస్తాన్‌కు దక్కాల్సిన నీటిలో ఒక్క చుక్కను కూడా లాక్కునేందుకు భారత్ ప్రయత్నిస్తే.. అలాంటి అవకాశం ఇవ్వబోమని తేల్చి చెప్పారు. సింధూ జలాలను సాధించుకోవడం కోసం ఎంత వరకైనా పాకిస్తాన్ పోరాటం చేస్తుందని షెహబాజ్ షరీఫ్ వెల్లడిరచారు.

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
TELTEL/2023/88710
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

79
పాఠకులకు, ప్రకటనకర్తలకు,
ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు
స్వాతంత్ర్య దినోత్సవ
శుభాకాంక్షలు

వరంగల్ | శుక్రవారం-15- ఆగస్టు - 2025 | సంపుటి : 3 | సంచిక : 80 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# వరద సహాయక చర్యల కోసం జిల్లాకు కోటి మంజూరు

- ఉమ్మడి పది జిల్లాలకు ప్రత్యేక అధికారులు నియామకం
- భారీ వర్షా లపై అత్యవసర సమీక్ష
- కలెక్టర్లు, ఎస్పీలతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

రాష్ట్రంలో కురుస్తున్న విస్తృత, భారీ వర్షాల దృష్ట్యా వరద సహాయక చర్యల కోసం ప్రభుత్వం అత్యవసరంగా స్పందించింది. ప్రతి జిల్లాకు కోటి రూపాయల చొప్పున నిధులు విడుదల చేసినట్టు రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.

మిగతా 4లో

# ఇందిరమ్మ ఇళ్లపై మరో గుడ్ న్యూస్

- రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తయింది
- ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలి
- హైదరాబాద్‌లోని హౌసింగ్ బోర్డుతో జాయింట్ వెంచర్‌గా ఉన్న ప్రాజెక్టుల్లోని సమస్యలను కూడా త్వరగా పరిష్కరించాలి
- సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)**

కాంగ్రెస్ అధికారంలో వస్తే పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. ఈ హామీమేరకు తొలుత ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించింది.

మిగతా 4లో



# దేశంలోని మనం అన్ని రకాలుగా ఉత్తమ స్థానంలో ఉన్నాం

- పోలీస్ సిబ్బందికి గ్రాడ్యుయేషన్ తప్పనిసరి నిర్ణయం
- అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీతో పోలీస్ శాఖ ఒప్పందం
- విధులు-చదువులకు సౌకర్యాలు, ప్రత్యేక శిక్షణ అందజేత

4లో




# భారీగా లైఫ్ ట్యాక్సుల పెంపు..!

- కొత్తగా కొనుగోలు చేసే వాహనాల రిజిస్ట్రేషన్ లైఫ్ ట్యాక్స్ భారీగా పెంచింది
- ఫ్యాన్సీ నంబర్లకు సంబంధించిన ఫీజులను సైతం రవాణాశాఖ పెంచుతూ నిర్ణయం

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)**

వాహనదారులకు రవాణాశాఖ షాక్ ఇచ్చింది. కొత్తగా కొనుగోలు చేసే వాహనాల రిజిస్ట్రేషన్ లైఫ్ ట్యాక్స్ భారీగా పెంచింది. వ్యక్తిగత బైకులపై రవాణాశాఖ భారీగా లైఫ్ ట్యాక్సను టాక్సను పెంచింది. ద్విచక్ర వాహనాలు, కార్లకు సంబంధించిన లైఫ్ టాక్స్ స్లాబ్‌లను మార్చింది. అదే సమయంలో ఫ్యాన్సీ నంబర్లకు సంబంధించిన ఫీజులను సైతం రవాణాశాఖ పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. ద్విచక్ర వాహనాలు రూ.లక్షలోపు (ఎక్స్‌షోరూం ధర) ఉన్న వాహనాలపై అదనపు భారం మోపకుండా కాస్త కనికరం చూపింది.

మిగతా 4లో

# బంజారాహిల్స్ పెద్దమ్మ గుడి వివాదంపై హైకోర్టు ఆదేశాలు జారీ

- పెద్దమ్మగుడి కూల్చివేతపై హైకోర్టు విచారణ
- విగ్రహాన్ని భద్రపరచాలని ప్రభుత్వానికి ఆదేశం
- కూల్చివేతపై ఆధారాలు సమర్పించాలన్న కోర్టు సూచన

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)**

బంజారాహిల్స్ రోడ్ నెం.12 పెద్దమ్మ గుడి కూల్చివేతపై గురువారంహైకోర్టు విచారణ చేపట్టింది. పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని భద్రంగా భద్రపరచాలని సూచించింది. విగ్రహం కూల్చివేతపై పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18కు వాయిదా వేసింది. పెద్దమ్మ గుడి కూల్చివేతపై హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ నమోదైంది.

మిగతా 4లో






# భయంతో వణుకుతున్న భాగ్యనగరం

- మూసీ పరివాహక ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక జారీ
- హిమాయత్ సాగర్ గేట్లు ఎత్తడంతో ఉగ్రరూపం దాల్చిన మూసి

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వర్షాల కురుస్తున్న నేపథ్యంలో భాగ్యనగరం భయంతో వణుకుతుంది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి.



మిగతా 4లో



# తృటిలో తప్పిన ఘోర ప్రమాదం..

## 20 మంది ఉద్యోగస్థులు క్షేమం

**పాలమూరు, (తెలంగాణ ముచ్చట్లు)**

జిల్లాలో ఘోర ప్రమాదం తృటిలో తప్పింది. ఈ ఘటనలో 20 మంది ఉద్యోగస్థులు క్షేమంగా బయటపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లి జాతీయ రహదారిపై

4లో

# నవోదయలో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు మళ్లీ గడువు పెంపు..

- జవహర్ నవోదయ 6వ తరగతి దరఖాస్తు గడువు ఆగస్టు 27 వరకు పొడిగింపు
- రెండు విడతల్లో 2026 ప్రవేశ పరీక్షల నిర్వహణ
- ఉచిత విద్య, వసతి సౌకర్యాలతో నవోదయలో ప్రవేశాలు



**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)**

జవహర్ నవోదయ విద్యాలయాల్లో 202627 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ గడువును మరోమారు పొడిగిస్తూ ప్రకటన వెలువరించింది. గతంలో ఇచ్చిన ప్రకటన మేరకు జులై 29 వరకు దరఖాస్తు గడువు ఇచ్చారు. దీనిని ఆగస్టు 13వ తేదీ వరకు పొడిగించారు. బుధవారంతో ఆ గడువు ముగియడంతో మరోమారు

మిగతా 4లో



# రాష్ట్రంలో పెరుగుతున్న సీజనల్ వ్యాధులు

- వాతావరణం కారణంగా పెరుగుతున్న సీజనల్ వ్యాధులు
- తేమ శాతం ఎక్కువగా ఉండడంతో చర్మసమస్యలు నమోదు
- పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్న వైద్యులు

5లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: హొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# వరద సహాయక చర్యల కోసం జిల్లాకు కోటి మంజూరు

(మొదటి పేజీ తరువాయి)



అవసరమైతే మరిన్ని నిధులు కూడా తక్షణం విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.
గురువారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు, చీఫ్ సెక్రటరీ రామకృష్ణ రావుతో కలిసి జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారి (ఎస్పి)లతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని, అందువల్ల ఏవైనా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గత మూడు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో అంచనా కంటే ఎక్కువ వర్షపాతం, మరికొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని వివరించారు.గత 24 గంటల్లో 10 సెంటీమీటర్లకుపైగా వర్షపాతం నమోదు అయిన భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, ఆసిఫాబాద్, పెద్దపల్లి,కరీంనగర్ వంటి జిల్లాల పరిస్థితులను స్వయంగా కలెక్టర్ల నుండి తెలుసుకున్నారు.
మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించడంతో ఆ జిల్లాల కలెక్టర్లకు తక్షణ చర్యలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి పది జిల్లాలలో సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించినట్టు వెల్లడించారు.సెలవులో ఉన్న అన్ని అధికారులు, సిబ్బంది వెంటనే విధులకు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు, వరద ముప్పు ప్రాంతాలలో రక్షణ చర్యలను వేగంగా అమలు చేయాలని, అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.ప్రత్యేకంగా గ్రేటర్ హైదరాబాద్‌లో మున్సిపల్ శాఖ, మెట్రో వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో పనిచేసి నగర ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండి, అధికారుల సూచనలను పాటించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

# ఇందిరమ్మ ఇళ్లపై మరో గుడ్ న్యూస్

(మొదటి పేజీ తరువాయి)



లబ్దిదారులకు దారులకు విడుదల వారీగా రూ.5లక్షలు అందజేస్తోంది. అయితే నియోజకవర్గానికి 3500 ఇళ్లు మాత్రమే కేటాయించారు. దీంతో మిగిలినవారు ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం తమకు ఎప్పుడు కేటాయిస్తుందా అని పలు చోట్ల పేదలు ఆశతో ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. హైదరాబాద్‌లోని హౌసింగ్ బోర్డుతో జాయింట్ వెంచర్‌గా ఉన్న ప్రాజెక్టుల్లోని సమస్యలను కూడా త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.
తెలంగాణలోని అన్ని భూములకు భూధార్ నెంబర్ల కేటాయింపుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై సీఎం సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో వారసత్వ, ఇతర మ్యుటేషన్లకు సంబంధించి స్వీకరించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సీఎం అధికారులకు సూచించారు. సర్వేల విషయంలో, లైసెన్డ్ సర్వేయర్లు పూర్తి చేసిన సర్వేలను రెగ్యులర్ సర్వేయర్లు వాటిని స్క్రూటినీ చేసేలా చూడాలని ఆదేశించారు. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో నిర్మించనున్న 10 కొత్త సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నమూనాలను సీఎం పరిశీలించారు. ప్రతి కార్యాలయంలో పార్కింగ్, క్యాంటీన్, ఇతర మౌలిక వసతులు ఉండాలని, ప్రజలకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని సీఎం అధికారులకు సూచించారు.

# దేశంలోని మనం అన్ని రకాలుగా ఉత్తమ స్థానంలో ఉన్నాం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



దేశంలోనే తొలిసారిగా తెలంగాణా పోలీస్ డిపోర్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న వారందరికీ గ్రాడ్యుయేషన్ ఉండాలని నిర్ణయించామని డీజీపీ జితేందర్ తెలిపారు. అందులోభాగంగా గురువారం హైదరాబాద్‌లో తెలంగాణా పోలీస్, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీల మధ్య ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. పోలీస్ డిపోర్ట్‌మెంట్‌లో 10వ తరగతి, ఇంటర్ చదివి గతంలో ఈ పోలీస్ శాఖలో చేరారని గుర్తు చేశారు. అయితే వారికి గ్రాడ్యుయేషన్ కల్పించాలని పోలీస్ శాఖ నిర్ణయం తీసుకుందన్నారు. వాని గ్రాడ్యుయేషన్ చేయించాలనే ఉద్దేశంతో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్నామని వివరించారు. డిపార్ట్‌మెంట్‌లో దాదాపు కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్స్.. 30 వేల మంది గ్రాడ్యుయేషన్ పూర్తి చేయని వారు ఉన్నట్లు తాము గుర్తించామని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో అందరూ గ్రాడ్యుయేషన్ చేసిన వారిగా ఉండాలని తమ సంకల్పమని ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు.
ఇక అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ గంటా చక్రపాణి మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాల పోలీస్ శాఖలకంటే.. మనం అన్ని రకాలుగా ఉత్తమ స్థానంలో ఉన్నామన్నారు. డీజీపీ జితేంద్రకి వచ్చిన అలోచనే ఇప్పుడు కార్యరూపం దాల్చిందని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో ప్రస్తుతం వివిధ విభాగాల్లో, పలు పోస్టుల్లో పని చేస్తున్న వారిలో కొందరికి డిగ్రీ అర్హత లేదని తెలిపారు. పలు కారణాలతో డిగ్రీ చేయకపోవడం లేదా డిగ్రీ మధ్యలోనే ఆపేసిన వాళ్లు సైతం ఉన్నారని వివరించారు. అలాంటి వారికి మా యూనివర్సిటీ ద్వారా ఓపెన్ డిగ్రీ చేసే అవకాశం కల్పిస్తున్నామన్నారు. అంతేకాకుండా.. వీళ్లకు అదనంగా పోలీసింగ్‌కి కావాల్సిన శిక్షణ సైతం అందిస్తామని తెలిపారు. ఒక వైపు విధులు నిర్వహిస్తూనే.. మరోవైపు చదువుకునే వెసులుబాటు కల్పించనున్నామని తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలోని ట్రైనింగ్ సెంటర్లను తాము ఈ అభ్యర్థుల కోసం వినియోగించుకోనున్నామని వీసీ ఘంటా చక్రపాణి చెప్పారు.

# భారీగా లైఫ్ ట్యాక్సుల పెంపు..!

(మొదటి పేజీ తరువాయి)




లక్ష దాటిన బైక్స్‌లపై మాత్రం టాక్స్‌లు పెంచింది. రూ.50వేల లోపు వాహనాలకు పాత పన్ను 9శాతం ఉండగా.. కొత్త పన్ను సైతం 9శాతం ఉండనున్నది. రూ.50వేల నుంచి రూ.లక్షలోపు వాహనాలకు పాత పన్ను 12శాతాన్నే కొనసాగించింది. రూ.లక్ష దాటిన వాహనాలపై 3శాతం టాక్స్‌ను పెంచింది. పాత పన్ను విధానం ప్రకారం 12శాతం ఉండగా.. దీన్నీ 15శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. రూ. 2లక్షలపైగా ఉండే వాహనాలకు పాత పన్ను 12శాతం ఉండగా.. కొత్త పన్ను 15శాతానికి పెంచింది. అదే సమయంలో వ్యక్తిగత కార్ల లైఫ్ ట్యాక్స్‌ను సైతం రవాణాశాఖ భారీగా పెంచింది. రూ.10లక్షలలోపు వాహనాలకు ఎలాంటి ప్రభావం ఉండదు. పాత పన్నులనే కొనసాగించింది. రూ.20లక్షల్లోపు వాహనాలకు పాత పన్ను 17శాతం ఉండగా.. ఒకశాతం పెంచడంతో 18శాతానికి పెరిగింది. రూ.20లక్షలకుపైగా ఉండే వాహనాలకు పాత పన్ను 18శాతం ఉండగా.. కొత్త పన్ను 20శాతానికి పెంచింది. రూ.50లక్షలకుపైగా ఉండే కార్లకు పాత పన్ను 18శాతం ఉండగా..కొత్త పన్నును 21శాతానికి పెంచుతూ ఆదేశాలు ఇచ్చింది. అదే సమయంలో ఫ్యాన్సీ నంబర్ల ఫీజులు సైతం పెరిగాయి. ఇంతకు ముందు ఐదుశ్లాబులు ఉండగా.. (రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు) ఉండగా.. వీటిని ఏడు శ్లాబులు (రూ.1.50 లక్షలు, రూ.1 లక్ష, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.6 వేలు)గా మార్చింది. 9999 వంటి నంబర్లకు ప్రస్తుతం రూ.50వేలకుపైగా చెల్లించాల్సి ఉండగా.. ఇక ముందు రూ.1.50లక్షలు కోట్ చేయాల్సి ఉంటుంది. ఒక 1, 9 వంటి నంబర్లకు రూ.లక్ష.. ఇతర ప్రీమియం నంబర్లకు రూ.50వేల నుంచి రేట్లను నిర్ణయించింది.

# తృటిలో తప్పిన ఘోర ప్రమాదం..

(మొదటి పేజీ తరువాయి)



జరిగిన వివరాలు ఇలా ఉన్నాయి . జాతీయ రహదారి నుంచి ఐటీ ఆఫీసు వెళ్లే మార్గంలో తెల్లవారుజామున నిన్న రాత్రి కురిసిన భారీ వర్షానికి దివిటిపల్లి చెరువు అలుగు పారింది. ఒక్కసారిగా నీళ్లు రోడ్డు పైకి వచ్చాయి. దయం అమర్‌రాజ బ్యాటరి కంపెనీ బస్ ఆ మార్గంలో వెళుతున్న సమయంలో ఒక్కసారిగా రోడ్డు కుంగి బస్సు ముందరి భాగం నీళ్లలో పడిరది. ఆ సమయంలో దాదాపు 20 మంది ఉద్యోగస్థులుండగా ఎమర్జెన్సీ డోర్ ద్వారా సురక్షితంగా బయటపడ్డారు. కొందరికి చిన్నపాటి గాయాలు అయ్యాయి. వారిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. గురువారం మధ్యాహ్నం క్రేన్ సహాయంతో బస్సును బయటకు తీశారు.

# బంజారాహిల్స్ పెద్దమ్మ గుడి వివాదంపై హైకోర్టు ఆదేశాలు జారీ

(మొదటి పేజీ తరువాయి)

అక్రమంగా కూల్చిన ఆలయాన్ని తక్షణమే నిర్మించాలని పల్లె వినోద్ కుమార్ అనే న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇవాళ విచారణ చేపట్టిన న్యాయస్థానం విగ్రహాన్ని భద్రపరిచి.. కూల్చివేతలకు గల ఆధారాలను సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. బంజారాహిల్స్‌లోని పెద్దమ్మ గుడి కూల్చివేతపై కొద్ది రోజులుగా వివాదం సాగుతోంది. కూల్చివేతకు నిరసనగా హిందూ సంఘాలు పెద్దఎత్తున నిరసనలు తెలిపారు. ఈ మేరకు గత మంగళవారం కుంకుమార్చాన పూజకు పిలుపునిచ్చారు హిందూ సంఘాల ప్రతినిధులు. ఈ పిలుపుతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బంజారాహిల్స్‌కు వెళ్లే అన్ని మార్గాలనూ మూసివేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పెద్దమ్మగుడి దగ్గర భారీగా పోలీసులను మోహరించారు. కాగా, తాజాగా ఈ ఘటనపై హైకోర్టులో విచారణ జరిగింది.

# భయంతో వణుకుతున్న భాగ్యనగరం

(మొదటి పేజీ తరువాయి)



జనజీవనం స్తంభించిపోయింది. అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ.. సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు. ఈ మేరకు అధికారులు మూసీ పరివాహక ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ నేపథ్యంలో హిమాయత్ సాగర్ 10గేట్లను అధికారులు తెరిచారు. దీంతో కుల్సుంపురా ప్రాంతంలోని మూసీ నది రోడ్డు వరదలకు గురైంది. వెంటనే అధికారులు రోడ్డును మూసివేసి వాహనాలను దారి మళ్లించారు. అయితే గేట్లు ఓపెన్ చేయడంతో నీటితో పాటు పురగులు, పాములు రోడ్లపైకి కొట్టుకువస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హిమాయత్ సాగర్ నుండి మూసి నదిలోకి వరద నీరు వదలడంతో పురాణ పుల్ స్మశాన వాటికలోకి నీరు వచ్చి చేరింది. దీంతో అంత్యక్రియలకు విఘాతం చోటుచేసుకుంది.
అయితే తాజాగా.. మూసి పరివాహక ప్రాంతాల్లో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు అధికారులు. హిమాయత్ సాగర్ గేట్లు ఎత్తడంతో ఉగ్రరూపం దాల్చింది మూసి. దీంతో జియాగూడ, పురానా పూల్ రోడ్డు మార్గం పూర్తిగా నీట మునిగింది. చాదర్ ఘాట్, శంకర్ నగర్ బస్తీలలో మూసీ వరదనీరు ఇళ్లలోకి చేరింది. దీంతో అధికారులు అక్కడి ప్రజలను ఇళ్లను ఖాళీ చేయిస్తున్నారు. వారందరిని పునరావాస కేంద్రాలకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు.
కాగా, బేగంబజార్ మార్కెట్‌లోని సంతోషి మాత దేవాలయం సమీపంలో ఉన్న 100 సంవత్సరాల పురాతన భవనం గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఇవాళ ఒక్కసారిగా కూలిపోయింది. ఈ పురాతన భవనంలో గత 20 సంవత్సరాలుగా ఎవరో నివాసం ఉండడం లేదు. ప్రస్తుతం ఖాళీగానే ఉంది. అయితే ప్రమాదం జరిగినప్పుడు పరిసర ప్రాంతాల్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసీ అధికారులు భవన శిథిలాలను తొలగిస్తున్నారు. అదేవిధంగా గోషామాల్ నియోజవర్గంలో పురాతన భవనాల్లో వ్యాపారాలను కొనసాగిస్తున్న వ్యాపారులు వెంటనే దుకాణాలను ఖాళీ చేసి వెళ్లాల్సిందిగా.. అధికారులు విజ్ఞప్తి చేశారు.



# మోదీ మూడోసారి ప్రధాని అయినప్పుడే మాకు అనుమానాలు వచ్చాయి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడానికి దొంగ ఓట్లే కారణమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఎన్నికల సంఘం బీజేపీ కనుసన్నల్లో పని చేస్తోందని ఆరోపించారు. ఓట్ల చోరీపై పోరాడుతున్న రాహుల్ గాంధీకి అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. బీజేపీ, ఆరెస్సెస్ ఇచ్చిన స్క్రిప్ట్ ను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ చదువుతున్నారని అన్నారు. ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థల ద్వారా దొంగ ఓట్లను సృష్టించారని విమర్శించారు. అంబేద్కర్ రాజ్యాంగం ఉండకూడదనేది బీజేపీ కుట్ర అని చెప్పారు. ఊహించని విధంగా మోదీ మూడోసారి ప్రధాని అయినప్పుడే తమకు అనుమానాలు వచ్చాయని జగ్గారెడ్డి అన్నారు. మారుమూల గ్రామాల్లో దొంగ ఓట్లను నమోదు చేయించి గెలిచేందుకు ప్రణాళికలు వేశారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో అందరూ దమ్మున్నోళ్లమేనని, కోమటిరెడ్డి సోదరులు కూడా దమ్మున్నవాళ్లేనని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి బీజేపీ స్క్రిప్ట్ చదవాలి కనుక ఆ పని చేశారని చెప్పారు. ఎన్టీఆర్ కుమార్తె పురందేశ్వరి అయినా బీజేపీ స్క్రిప్ట్ చదవాల్సిందేనని జగ్గారెడ్డి అన్నారు.

# నవోదయలో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు మళ్లీ గడువు పెంపు..

(మొదటి పేజీ తరువాయి)

జవహర్ నవోదయ విద్యాలయాల సంస్థ దరఖాస్తు గడువును రెండోసారి పొడిగించింది. తాజా ప్రకటన మేరకు ఆగస్టు 27వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులకు అవకాశం కల్పించారు. అర్హులైన, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆగస్టు 27వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
కాగా దేశ వ్యాప్తంగా మొత్తం 654 జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో సీట్ల భర్తీకి రెండు విడతల్లో రాత పరీక్ష 2026 నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఏపీ, తెలంగాణతోపాటు పలు రాష్ట్రాల్లో డిసెంబర్ 13, 2025 (శనివారం)న తొలి దశ రాత పరీక్ష నిర్వహించారు. జమ్మూ కశ్మీర్ సహా పలు పర్వత ప్రాంత రాష్ట్రాల్లో వచ్చే ఏడాది (2026) ఏప్రిల్ 11న తుది దశ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన ర్యాంకు ఆధారంగా ఆరో తరగతిలో ప్రవేశాలు కల్పిస్తారు. ఇందులో ఒక్కసారి సీటు వస్తే ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు సీబీఎస్సీ సిలబస్‌తో ఉచితంగా విద్యాతోపాటు ఆవాస, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. బాలికలకు, బాలురకు వేర్వేరు వసతి సౌకర్యం ఉంటుంది. మొత్తం నవోదయ విద్యాలయాల్లో ఏపీలో 15, తెలంగాణలో 9 చొప్పున ఉన్నాయి. ఒక్కో నవోదయలో గరిష్ఠంగా 80 మంది విద్యార్థులకు ఆరో తరగతిలో ప్రవేశం కల్పిస్తారు. మొత్తం సీట్లలో 75 శాతం గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు.. మిగతా 25 శాతం సీట్లను ఇతరులకు కేటాయిస్తారు. అలాగే మొత్తం సీట్లలో మూడో వంతు బాలికలకు కేటాయిస్తారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# రాష్ట్రంలో పెరుగుతున్న సీజనల్ వ్యాధులు

- వాతావరణం కారణంగా పెరుగుతున్న సీజనల్ వ్యాధులు
- తేమ శాతం ఎక్కువగా ఉండడంతో చర్మసమస్యలు కూడా నమోదు
- పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్న వైద్యులు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)





కొన్ని రోజులుగా మబ్బులతో కూడిన వాతావరణం, తరచూ వానల ప్రభావంతో ఆరోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఖాళీ ప్రదేశాలు మురికికూపాలుగా తయారయ్యాయి. పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. గాలిలో తేమశాతం ఎక్కువగా ఉండడం వల్ల బ్యాక్టీరియా, ఫంగస్, వైరస్ వంటివి వేగంగా వృద్ధి చెందుతున్నాయి. ఇన్‌ఫెక్షన్ సోకి జనం జ్వరాల బారిన పడుతున్నారు. కుటుంబంలోని ఒకరికి జర్వం సోకితే ఇంటిల్లిపాదికి వ్యాప్తి చెందుతుంది. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్య జలుబు, దగ్గు, గొంతునొప్పి, వాంతులు, డయోరియాతో ఆసుపత్రులకు ఎక్కువ మంది రోగులు వస్తున్నారు. 40శాతం మంది సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారు. తీవ్రమైన వైరల్ జ్వరం, ఒళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలతో అనేక మంది ఇబ్బందులు పడుతున్నారు. డెంగీ, చికున్‌గన్యా వ్యాధులు పెరుగుతున్నాయి. ఈ లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలి. తేమ వాతావరణంతో పాటు తడి దుస్తులు ధరించడం వల్ల ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు, దురద, దద్దుర్లు వంటి చర్మ సమస్యలు పెరుగుతున్నాయి. జర్వ వచ్చినవారిలో ప్లేట్‌లెట్లు తగ్గి, ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్నవారు, వృద్ధులు, పిల్లలు ఆయా సమస్యలతో ఎక్కువగా ఆసుపత్రులను సంప్రదిస్తున్నారు. మరోవైపు డెంగీ కేసులు కూడా పెరుగుతున్నాయి. దోమల రాకుండా నీళ్లు ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీళ్లు ఆగకుండా చూసుకోవాలి. వర్షాకాలం ప్రారంభమైందంటే చాలా సీజనల్ వ్యాధులు వ్యాపి పెరుగుతుంది. వరద నీరు కారణంగా అపరిశుభ్రత, ఎక్కడంటే అక్కడ నీరు ఆగడం దీంతో దోమలు పెరుగుతుంటాయి. ఈ కారణంగా డెంగీ, మలేరియా కేసులు పెచ్చరిల్లుతాయి. ముఖ్యంగా ఈ కాలంలో చిన్న పిల్లలు, వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. స్కూల్ , కాలేజీ పిల్లలు వర్షాల్లో తడుస్తుంటారు దీనివల్ల వారికి జ్వరాలు, జలుబు వంటివి మొదలైతాయి. అవి కాస్త ముదిరి వ్యాధికి దారితీస్తాయి. వర్షంలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. జ్వరం, జలుబు, దగ్గు ఉంటే సొంత వైద్యం చేసుకోకుండా ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. అలాగే ఈ కాలంలో మంచి నీటిని గోరు వెచ్చగా చేసి తాగాలని సూచించారు. కూరగాయలను ఒకటికి రెండుసార్లు కడిగి వాడాలని తెలిపారు.

# రాహుల్ గాంధీ రాజీనామా చేస్తే బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తాం

- పతిపక్ష నేతకు వ్యవస్థల మీద నమ్మకం లేకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్య
- బీహార్‌లో ఓడిపోతారు కాబట్టి ఈవీఎంలు పని చేయవని చెప్పడమేమిటని నిలదీత

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



రాయ్‌బరేలీ నుంచి రాహుల్ గాంధీ రాజీనామా చేయాలని, ఆయన రాజీనామా చేస్తే బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తామని మెదక్ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశానికి ప్రతిపక్ష నేతగా ఉన్న వ్యక్తికి వ్యవస్థల మీద నమ్మకం లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. బ్యాలెట్ పేపర్ కాదని నాటి రాజీవ్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించిందని గుర్తు చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు పనిచేసినట్లు, బీహార్‌లో ఓడిపోతామని భావించి ఈవీఎంలు పనిచేయడం లేదని అంటారా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ రాయ్‌బరేలీలో గెలిచారని, అక్కడ రెండు లక్షల ఓట్లు అనుమానంగా కనిపిస్తున్నాయని అన్నారు. అక్కడ ఆయన దొంగ ఓట్లతో గెలిచారని, ఆయన ఎన్నికను రద్దు చేయాలని కోరనున్నామని తెలిపారు.

బెంగాల్‌లో డైమండ్ హార్బర్ నియోజకవర్గంపై, ఉత్తర ప్రదేశ్‌లో అఖిలేశ్ యాదవ్ అర్ధాంగి డిరపుల్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంపై అనుమానాలు ఉన్నట్లు రఘునందన్ రావు పేర్కొన్నారు. ఓడిపోతే ఈవీఎంల మీద బురదజల్లి ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగాన్ని, న్యాయవ్యవస్థలను కాంగ్రెస్ గౌరవించడం లేదని మండిపడ్డారు. ఆరోపణలు చేసే ముందు శాస్త్రీయంగా వ్యవస్థల మీద అధ్యయనం చేయాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.



# మాజీ ఎంపీటీసీ కుమార్తె వివాహానికి హాజరైన ఎమ్మెల్యే మేఘా రెడ్డి

వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:

పెద్దమందడి మండలం మదిగట్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు రామచంద్రయ్య గౌడ్ కుమార్తె వివాహం వనపర్తి పట్టణంలోని లక్ష్మీ కృష్ణ గార్డెన్‌లో గురువారం ఘనంగా జరిగింది. వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వివాహ సంబంధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా నిలిచిన స్నేహితులు

- స్నేహబంధానికి నిలువెత్తు నిదర్శనం
- చిన్నపెండ్యాల ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఎస్సెస్సి 2002-03 బ్యాచ్

ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:



"స్నేహం అనేది కష్టసమయంలో తోడుగా నిలబడినప్పుడే తన అసలైన అర్థాన్ని చూపుతుంది" అనే సామెతను నిజం చేస్తూ, చిన్నపెండ్యాల ప్రభుత్వ పాఠశాలకు చెందిన 200203 విద్యాసంవత్సరపు ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఒక హృదయాన్ని హత్తుకునే ఉదాహరణ సృష్టించారు. ఈ బ్యాచ్‌కు చెందిన వారి స్నేహితుడు ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన పెసరు రవీందర్ (జేసీబీ) ఇటీవల తన తండ్రి పెసరు కుమారస్వామిని కోల్పోయాడు. ఈ ఆకస్మిక దుర్ఘటనతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని గమనించిన స్నేహితులు, రవీందర్‌కు అండగా నిలుస్తూ ₹25,000 ఆర్థిక సాయం అందజేశారు.

సురేష్, ఎండి అసాద్, కీర్తి, నారాయణ, సారంగా, పని, గొడుగు, సాంబరాజు, రాజు, శ్రీనివాస్, వెంకటేష్, బిక్షపతి, సార్ నరేష్, తిరుపతి, భాస్కర్, బాలరాజు, అనిల్, శ్రీనివాస్, చిలుక, అశోక్, చుక్క, రాజేష్ వంటి తోటి మిత్రులు ఈ సహాయానికి ముందుకు వచ్చారు. ఎవరి వృత్తి, స్థితిగతులు ఎలా ఉన్నా, ఒకరి బాధను అందరూ తమ బాధగా భావించి ఈ సాయం అందించడం స్నేహబంధానికి ప్రతీకగా నిలిచింది.

ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా, ఒకరి ఆపదలో అందరూ కలసి నిలబడిన మానవత్వానికి ప్రతీక. స్నేహితుల ఈ త్యాగం, పరస్పర విశ్వాసం, నిస్వార్థ సహకారం సమాజంలో మరెందరికో ప్రేరణనిస్తోంది. "మనిషి వద్ద సంపద, స్థానం ఎంత ఉన్నా, ఆపదలో తోడు నిలిచే మనుషులు ఉంటేనే జీవితం సార్థకం అవుతుంది" అనే సందేశాన్ని వీరు అందించారు.

గ్రామస్థులు, పరిచయస్తులు ఈ స్నేహితుల చర్యను అభినందిస్తూ, "ఇలాంటి మానవీయ విలువలు ప్రతి ఒక్కరిలో పెంపొందాలి" అని ప్రశంసిస్తున్నారు. నిజమైన స్నేహం అంటే ఇదే అని చెప్పేలా ఈ సంఘటన అందరికీ ఒక ఆదర్శంగా నిలుస్తోంది.






# పాత్రికేయులు ప్రజాపక్షంగానే పనిచేయాలి

- పనిచేసే ప్రతి జర్నలిస్టుకు పక్కా ఇల్లు నిర్మాణం
- ప్రెస్ క్లబ్ భవన ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:

పాత్రికేయులు (జర్నలిస్టులు) ఎప్పటికీ ప్రజాపక్షంగానే ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికై వారదులుగా వ్యవహరించాలని, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.గురువారం ఖిల్లా ఘణపురం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పాత్రికేయుల భవనాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులో పార్టీలకతీతంగా పనిచేయాలన్నారు.నిజా నిజాలు నిర్ధారించుకొని రాసే వార్తలకు ఎప్పటికీ ప్రజాధరణం ఉంటుందని,మొక్కుబడి వార్తలు వ్యక్తిగత విమర్శలతో కూడిన వార్తలు నిరాధార వార్తలు మనుషుల మధ్య వ్యత్యాసాన్ని పెంచుతాయే తప్ప దేనికి ఉపయోగపడని అలాంటి వార్తలను రాసేవాళ్లను సైతం ప్రోత్సహించరాదని ఎమ్మెల్యే సూచించారు. జర్నలిస్టులకు ఉన్న సమస్యలు తెలుసునని వనపర్తి నియోజకవర్గ పరిధిలోని ప్రతి జర్నలిస్టుకు భేదాభిప్రాయాలు లేకుండా ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. తాను సొంతంగా జర్నలిస్టు కుటుంబాలకు భీమా చేయిస్తానని చెప్పానని అందుకు సంబంధించిన పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.స్థానిక నాయకులు, జర్నలిస్టులు సమన్వయంతో పనిచేయాలన్నారు.ఖిల్లా ఘనపూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రెస్ క్లబ్ భవన అభివృద్ధికి తాను ఎల్లవేళలా సహకరిస్తానని రానున్న రోజుల్లో ఖిల్లా ఘనపూర్ ప్రెస్ క్లబ్ జిల్లాకే మోడల్ గా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ సాయి చరణ్ రెడ్డి, మండల అధ్యక్షులు విజయకుమార్, శ్యాంసుందర్, రవి నాయక్, ఆగారం ప్రకాష్, గంజాయి రమేష్, నవీన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహానుభావులు , త్యాగధనులు పోరాట ఫలితమే స్వాతంత్రం!

- స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తీగల..

సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:



ఎందరో మహానుభావులు, త్యాగధనులు పోరాట ఫలితమే స్వాతంత్రం అని, సత్తుపల్లి ఐ.ఎన్.టి.యు.సి బ్రాంచ్ కార్యదర్శి తీగల క్రాంతి కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులకు 79వ స్వాతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. బ్రిటిష్‌వారి పరిపాలన నుంచి విముక్తి పొందడానికి నిర్వహించిన జాతీయ ఉద్యమంలో ఎందరో మహానుభావులు, త్యాగధనులు పోరాటాలు చేశారని గుర్తు చేశారు. దేశ విముక్తి కోసం చేసిన పోరాటం ప్రపంచంలోనే అపూర్వమైనదని, దీర్ఘకాలంగా సాగిన పోరాటంలో ఎంతోమంది స్ఫూర్తి ప్రదాతలు ఆసువులు బాసారని , వారి త్యాగ ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్రం అని పేర్కొన్నారు. భారతదేశ సార్వ భౌమత్వనీ సమగ్రతను కాపాడుకోవడం మన బాధ్యతగా భావించాలని, స్వాతంత్రం కోసం పోరాడిన త్యాగధనులకు నివాళు లు అర్పిస్తూ గర్వంగా తివర్ణ పథకానికి సెల్యూట్ చేద్దామని పిలుపునిచ్చారు.

# ప్రభుత్వాలు మారినా ప్రజల ఇబ్బందులు మారడం లేదు

- వర్షా లు పడితే అంతే.. శాశ్వత పరిష్కారం చూపడంలో ప్రభుత్వాలు విఫలం
- కాలువలు సరిగా లేక పంటల నాశనం
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- అల్వాల బ్రిడ్జ్ కట్టి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజల డిమాండ్

వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:



ప్రభుత్వాలు మారిన ప్రజల ఇబ్బందులు మారడం లేదని, ప్రజల సమస్యలు శాశ్వత పరిష్కారం చూపడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కాలువలు సరిగా లేక పంటలు నాశనమవుతున్నాయని, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం నుండి అల్వాల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న చిన్న వాగు, పెద్ద వాగులు వర్షాకాలంలో ప్రజలకు నిజమైన శాపంగా మారాయి. వర్షపు నీరు పొంగిపొర్లి రహదారిని ముంచేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వాగులకు సరైన కాలువలు లేకపోవడంతో పక్కనే ఉన్న పంట పొలాల్లో నీరు చేరి పంటలు మునిగిపోతున్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. "మా పంటలు కళ్ల ముందే మునిగిపోతుంటే చూడలేకపోతున్నాం" అని రైతులు వాపోతున్నారు.మరోవైపు, అత్యవసర పరిస్థితుల్లో వాగులు దాటడానికి ప్రయత్నించే వాహనదారులు ప్రమాదవశాత్తు నీటిలో జారి పడుతున్నారు. పలువురు గాయపడి ఆసుపత్రిపాలు అయిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రజలు, రైతులు ఈ రెండు వాగులపై వెంటనే శాశ్వత బ్రిడ్జి నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సమస్య త్వరగా పరిష్కరించాలని, లేకపోతే పరిస్థితి మరింత విషమించవచ్చని అంటున్నారు.



# మాజీ ఎంపీటీసీ కుమార్తె వివాహానికి హాజరైన విలేకరులు

వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు:

వనపర్తి పట్టణంలోని శ్రీ లక్ష్మీ కృష్ణ గార్డెన్స్‌లో గురువారం పెద్దమందడి మండలం మదిగట్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు రామచంద్రయ్య గౌడ్ కుమార్తె వివాహం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు మండలంలోని విలేకరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో వెంకట్ గౌడ్, బండి రాజు,బాజా శేఖర్, నక్క కృష్ణ యాదవ్, మహేష్, మన్నెం తదితర విలేకరులు పాల్గొన్నారు.స్నేహపూర్వక వాతావరణంలో జరిగిన ఈ వివాహ వేడుకలో వధూవరులను పలువురు బంధుమిత్రులు, రాజకీయ నాయకులు, స్థానిక ప్రముఖులు ఆశీర్వదించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఆరోగ్యానికి అమృతం కివి పండు!

కివి పండు.. రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. విటమిన్ సి శరీరంలోతెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచుతుంది. ఇది ఇన్ఫెక్షన్లు, వ్యాధులతో పోరాడటానికి సహాయపడుతుంది. కివిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థకు కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. కివిలో ఉండే ఆక్టినిడిన్ ఎంజైమ్ ప్రోటీన్లను జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. ఇది కడుపు సమస్యలను తగ్గిస్తుంది. కివీలో పొటాషియం, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా కివీస్ లోని యాంటీఆక్సిడెంట్లు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో కూడా సహాయపడతాయి. కివిలో విటమిన్ సి, విటమిన్ ఇ వంటి యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి చర్మానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. ఈ పదార్థాలు చర్మాన్ని మెరుగుపరచడంలో, ముడతలను తగ్గించడంలో, చర్మం స్థితిస్థాపకతను కాపాడుకోవడంలో సహాయపడతాయి. కివి తినడం వల్ల వృద్ధాప్య సంకేతాలు తగ్గుతాయి. కివిలో సెరోటోనిన్ ఉంటుంది. ఇది నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ప్రతిరోజూ పడుకునే ముందు కివి తినడం వల్ల మంచి నిద్ర వస్తుందట. నిద్రలేమి సమస్య ఉన్నవారు రోజుకో కివి తింటే కమ్మని నిద్ర వస్తుంది. కివిలో లుటీన్, జియాక్సంతిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కళ్ళకు మేలు చేస్తాయి. ఈ పదార్థాలు కంటిశుక్లం, వయస్సు సంబంధిత కంటి సమస్యల నుంచి కళ్ళను రక్షించడంలో సహాయపడతాయి.



# నెల పాటు టీ తాగడం మానేస్తే..
# నమ్మలేని ఎన్నో అద్భుతాలు..!

దయం నిద్ర లేచింది మొదలు చాలా మంది తమ రోజును 'టీ'తోనే ప్రారంభిస్తారు. ఘుమఘుమలాడే టీ చుక్కలు గొంతులు తడిపితే రోజంతా హుషారు పుంతలు తొక్కుతుంది. ఇక కొందరైతే పడుకునే ముందు కూడా 'టీ' తాగుతారు. మన తెలుగు వారికి టీతో చాలా ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా ఉదయం నిద్ర లేచింది మొదలు చాలా మంది తమ రోజును 'టీ'తోనే ప్రారంభిస్తారు. ఘుమఘుమలాడే టీ చుక్కలు గొంతులు తడిపితే రోజంతా హుషారు పుంతలు తొక్కుతుంది. ఇక కొందరైతే పడుకునే ముందు కూడా 'టీ' తాగుతారు. అయితే టీ ఇలా వేళాపాలా లేకుండా తాగడం పట్ల ఆరోగ్యానికి ఎన్నోరకాలు హానికరమని నిపుణులు అంటున్నారు. అదే 30 రోజులపాటు టీ తాగకపోతే మన శరీరంలో జరిగే మార్పులు అన్నీ ఇన్నీ కావు. ముఖ్యంగా బరువు తగ్గడంలో సహాయపడుతుంది. అవును.. ఓ నెల పాటు టీ తాగకపోతే బరువు వేగంగా తగ్గవచ్చట. ఇందులో కేలరీలు, చక్కెర అధికంగా ఉంటాయి. ఇవి బరువు పెరగడానికి దారి తీస్తాయి. అటువంటి పరిస్థితిలో టీ తాగకపోవడం వల్ల కేలరీల తీసుకోవడం తగ్గుతుంది. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. పాలతో చేసిన టీ తాగకపోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మిల్క్ టీలో ఉండే కెఫిన్, టానిన్లు జీర్ణ ప్రక్రియను నెమ్మదించేలా చేస్తాయి. ఇది అసిడిటీ సమస్యలను కలిగిస్తుంది. అదే టీ తాగడం మానేస్తే, జీర్ణక్రియ మెరుగుపడి అసిడిటీ సమస్య తొలగిపోతుంది. టీలో ఉండే కెఫిన్ నిద్రకు అంతరాయం కలిగిస్తుంది. టీ తీసుకోవడం తగ్గించడం వల్ల బాగా నిద్రపడుతుంది. అది రోజంతా మిమ్మల్ని ఉత్సాహంగా ఉంచుతుంది. టీలోని చక్కెర చర్మాన్ని దెబ్బతీస్తుంది. ఇది



మొటిమలకు కూడా కారణమవుతుంది. టీ తీసుకోవడం తగ్గిస్తే చర్మం ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా మారుతుంది. టీ తీసుకున్న వెంటనే ఒంట్లో శక్తి స్థాయిలను పెంచుతుంది. కానీ తరువాత మీరు అలసిపోయినట్లు అనిపిస్తుంది. కాబట్టి మీరు టీ తాగడం మానేస్తే ఒంట్లో శక్తి స్థాయిలు రోజంతా స్థిరంగా ఉంటాయి. గుండె ఆరోగ్యాన్ని కూడా మెరుగుపడుతుంది. టీ గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి, ఓ నెల పాటు టీ తాగకపోతే గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.

# రోజుకొక్కటి తీసుకుంటే డాక్టర్‌తో పనే ఉండదిక!

అత్యధికంగా ప్రోటీన్లు అందించే అవకాడో పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. బటర్ ఫ్రూట్‌గా పిలిచే ఇందులో ఔషధ గుణాలు మెండుగా ఉన్నాయి. పోషకాలు పుష్కలంగా ఉండే ఈ అవకాడో మహిళల ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తుంది. ఆరోగ్యానికి పండ్లు ఎంతో మేలు చేస్తాయి. అందుకే వైద్యులు నిత్యం వీటిని తీసుకోవాలని సూచిస్తుంటారు. అత్యధికంగా ప్రోటీన్లు అందించే అవకాడో పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.. బట్టర్ ఫ్రూట్‌గా పిలిచే ఇందులో ఔషధ గుణాలు మెండుగా ఉన్నాయి. పోషకాలు పుష్కలంగా ఉండే ఈ అవకాడో మహిళల ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తుంది. అవకాడోలు హార్మోన్ల సమతుల్యతను కాపాడుకోవడానికి చాలా అవసరం. ఇది పీరియడ్స్‌ను క్రమబద్ధీకరించడంలో సహాయపడుతుంది. చర్మానికి మేలు చేస్తుందిజ అవకాడోలో విటమిన్ ఇ, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని మృదువుగా, ప్రకాశవంతంగా, ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. ఒంట్లో హార్మోన్ల సమతుల్యతను కాపాడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు (మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు) అధికంగా ఉంటాయి. ఇవి మహిళల హార్మోన్ల అసమతుల్యతను క్రమబద్ధం చేయడంలో ఉపయోగపడతాయి. గర్భధారణకూ మంచిదే. అవకాడోలో ఫోలిక్ యాసిడ్ అధికంగా ఉండటం వల్ల గర్భధారణకు ముందు, గర్భధారణ సమయంలో చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది పిండం అభివృద్ధికి సహాయపడుతుంది. గుండెకు కూడా మేలు చేస్తుంది. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎముకలను బలంగా ఉంచుతుంది. అవకాడోలో ఎముకల బలానికి అవసరమైన విటమిన్ కె, కాల్షియం, భాస్వరం ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది.



# వీరికి కొబ్బరి నీళ్లు విషంతో సమానం..

కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి ఎంతో మంచిది. అందుకే వీటిని అన్ని వయసుల వారు తాగుతుంటారు. అయితే కొబ్బరి నీళ్లలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఎలక్ట్రోలైట్లు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి వ్యాయామం చేసిన తర్వాత తక్షణ శక్తి కోసం వీటిని తాగొచ్చు. ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. కొబ్బరి నీరు ప్రకృతి అందించిన అమృతం. కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి ఎంతో మంచిది. అందుకే వీటిని అన్ని వయసుల వారు తాగుతుంటారు. అయితే కొబ్బరి నీళ్లలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఎలక్ట్రోలైట్లు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి వ్యాయామం చేసిన తర్వాత తక్షణ శక్తి కోసం వీటిని తాగొచ్చు. ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. అంతే కాదు చర్మ కాంతిని పెంచడం నుంచి జీర్ణక్రియ వరకు, ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు అందిస్తుంది. కానీ అమృతం లక్షణాలతో కూడిన ఈ పానీయం కొందరికి మాత్రం విషంతో సమానం. అంటే ఈ సహజ పానీయం కొంతమంది ఆరోగ్యాన్ని మరింత దిగజార్చి ప్రాణాంతకంగా మారుతుంది.



కొబ్బరి నీళ్లలో సహజ చక్కెర ఉంటుంది. కాబట్టి డయాబెటిస్ ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. ఒక చిన్న గ్లాసు (అంటే 200 మి.లీ)లో దాదాపు 6 నుంచి 7 గ్రాముల చక్కెర ఉంటుంది. ఇది పండ్ల రసాల కంటే తక్కువ. కానీ ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. అందుకే డయాబెటిస్ లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారు తక్కువ పరిమాణంలో మాత్రమే కొబ్బరి నీళ్లు తాగాలి. లేదంటే రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. ముఖ్యంగా కొన్ని కొబ్బరి నీళ్లలో చక్కెర కలిపి తాగారో.. పరిస్థితిని మరింత దిగజార్చుతుంది. కాబట్టి డయాబెటిస్ ఉంటే కొబ్బరి నీళ్ళు తాగే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది.

అలెర్జీలు: అలెర్జీలు ఉంటే మరింత జాగ్రత్తగా ఉండాలి. కొబ్బరి నీళ్లకు అలెర్జీలు చాలా అరుదుగా ఉన్నప్పటికీ, తగినంత జాగ్రత్తగా ఉండాలి. కొంతమందికి కొబ్బరి నీళ్ళు తాగిన వెంటనే చర్మంపై దురద, వాపు, ఎరుపు రంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో ఇది శ్వాస తీసుకోవడంలో కూడా సమస్యలను కలిగిస్తుంది. పిల్లలకు కొబ్బరి నీళ్ల అలెర్జీలు వచ్చే అవకాశం మరింత ఎక్కువగా ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. కొబ్బరి నీళ్ళు తాగిన తర్వాత మీకు ఏవైనా అసాధారణ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.

మూత్రపిండాల సమస్యలు: మూత్రపిండాల సమస్యలు ఉన్నవారికి కొబ్బరి నీరు మంచిది కాదు. కొబ్బరి నీళ్లలో పొటాషియం ఉంటుంది. ఇది ఆరోగ్యవంతులకు మంచిదే అయినప్పటికీ, మూత్రపిండాల సమస్యలు ఉన్నవారికి ఇది ప్రమాదకరం. దెబ్బతిన్న మూత్రపిండాలు అదనపు పొటాషియంను ఫిల్టర్ చేయడానికి అధికంగా కష్టపడతాయి. ఇది రక్తంలో పేరుకుపోతుంది. ఇది హైపర్‌కలేమియాకు కూడా దారితీస్తుంది. కండరాలు, గుండెను ప్రభావితం చేసే పరిస్థితి కూడా తలెత్తుతుంది. బలహీనత, వికారం తీవ్రమైన సందర్భాల్లో క్రమరహిత హృదయ స్పందన లక్షణాలు కనిపిస్తాయి. కాబట్టి మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు కొబ్బరి నీళ్లు తాగే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది.

జలుబు, ఫ్లూ ఉన్నవారికి తగదు: జలుబు, ఫ్లూ ఉన్నప్పుడు కొబ్బరి నీళ్లు తాగడం అంత మంచిది కాదు. ఎందుకంటే ఇది శరీరాన్ని త్వరగా చల్లబరుస్తుంది. కాబట్టి వేసవి రోజుల్లో తాగడానికి బాగున్నప్పటికీ జలుబు, దగ్గుతో బాధపడేవారికి ఇది మంచిది కాదు. దీని చల్లబరిచే స్వభావం శ్లేష్మం మొత్తాన్ని పెంచడమే కాకుండా శరీరానికి వెచ్చదనం అవసరమైనప్పుడు శరీరాన్ని చల్లబరుస్తుంది. కాబట్టి అనారోగ్యంతో, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు కొబ్బరి నీళ్లకు బదులుగా అల్లం టీ లేదా వేడి సూప్‌లు తాగడం మంచిది.

అధిక రక్తపోటు ఉన్నవారికీ డేంజర్: అధిక రక్తపోటు ఉంటే జాగ్రత్తగా ఉండాలి. కొబ్బరి నీళ్ళలోని పొటాషియం కంటెంట్ కారణంగా రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుందని చెబుతారు. అయితే రక్తపోటు మందులు ముఖ్యంగా ఏసిఇ ఇన్హిబిటర్లు లేదా పొటాషియంస్పేరింగ్ డైయూరిటిక్స్ తీసుకునే వారికి కొబ్బరి నీళ్ళు ప్రమాదకరం. ఈ మందులు పొటాషియం స్థాయిలను పెంచుతాయి. కొబ్బరి నీళ్ళు వాటిని మరింత పెంచుతాయి. ఇది ఛాతీ నొప్పి, కండరాల తిమ్మిరి, క్రమరహిత హృదయ స్పందనకు కారణమవుతుంది.

# వేప ఆకులలో ఔషధ గుణాలు ఉన్నాయా?

మొటిమలు, నల్లటి మచ్చలు, పొడి చర్మం, చుండ్రు వంటి సమస్యలకు చికిత్స చేయడానికి ప్రజలు వేపను ఉపయోగిస్తున్నారు. నూనె, పొడి లేదా పేస్ట్ రూపంలో వేప మీ సాధారణ చర్మ సంరక్షణ దినచర్యలో మంచి, శక్తివంతమైన భాగంగా ఉంటుంది. ఆయుర్వేదంలో వేప అనేక ప్రయోజనాలను ప్రస్తావించారు. వేపలో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. వేప మన ఆరోగ్యానికి, చర్మ ఆరోగ్యానికి ప్రయోజనకరంగా పరిగణిస్తారు. వేపలో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఫంగల్ లక్షణాలు కనిపిస్తాయి. ఇవి ఆరోగ్యకరమైన, మెరిసే చర్మాన్ని పొందడానికి మీకు సహాయపడతాయి. వేప క్రిములతో పోరాడటానికి, మంటను తగ్గించడానికి, చర్మ ఇన్ఫెక్షన్లను తగ్గించడంలో సహాయపడుతుంది. మొటిమలు, నల్లటి మచ్చలు, పొడి చర్మం, చుండ్రు వంటి సమస్యలకు చికిత్స చేయడానికి ప్రజలు వేపను ఉపయోగిస్తున్నారు. నూనె, పొడి లేదా పేస్ట్ రూపంలో వేప మీ సాధారణ చర్మ సంరక్షణ దినచర్యలో మంచి, శక్తివంతమైన భాగంగా ఉంటుంది.వేప ఆకులు మొటిమలను తొలగిస్తుంది. మొటిమలను నివారిస్తుంది: వేప యాంటీ బాక్టీరియల్ లక్షణాలు మొటిమలను కలిగించే బ్యాక్టీరియాతో పోరాడటానికి, మంటను తగ్గించడానికి, భవిష్యత్తులో మొటిమలను నివారించడానికి సహాయపడతాయి. వృద్ధాప్యాన్ని నివారిస్తుంది: వేపలోని యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి. ఫైన్ లైన్స్, ముడతలు, వయసు మచ్చలను తగ్గిస్తాయి. చర్మాన్ని యవ్వనంగా, ప్రకాశవంతంగా ఉంచుతాయి. పర్యావరణ ఒత్తిడి, నష్టం నుండి రక్షిస్తాయి.వాపు నిరోధకం: వేపలోని వాపు నిరోధక లక్షణాలు చికాకు కలిగించే చర్మాన్ని ఉపశమనం చేస్తాయి. ఎరుపు, మంటను తగ్గిస్తాయి.యాంటీ ఫంగల్: వేపలోని యాంటీ ఫంగల్ లక్షణాలు, రింగ్‌వార్మ్, అథ్లెట్స్ ఫుట్ వంటి ఫంగల్ ఇన్ఫెక్షన్లతో పోరాడుతాయి. ఆరోగ్యకరమైన చర్మాన్ని ప్రోత్సహిస్తాయి. ఫంగల్ పెరుగుదలను నిరోధిస్తాయి. నల్లటి వలయాలు, అసమాన చర్మాన్ని తగ్గిస్తుంది: వేప ఓదార్పునిచ్చే, టీఆక్సిడెంట్ లక్షణాలు చర్మపు రంగు, నల్లటి వలయాలను తేలికపరచడంలో సహాయపడతాయి. చర్మాన్ని సమానంగా, తాజాగా ఉంచుతాయి.



# ఆలూ చిప్స్ రోజూ లాగిస్తున్నారా?

చాలా మందికి నూనెలో వేయించిన పొటాటో చిప్స తినడం చాలా ఇష్టం. అయితే వీటిని రోజూ తినడం వల్ల ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావాలు ఉంటాయి? అలాగే నెలలో ఎన్ని సార్లు ఆలూ చిప్స తినవచ్చు? అసలు రోజూ తింటే ఏమవుతుంది? నూనెలో వేయించిన ఆలూ చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్ వంటి వేయించిన ఆహారాలు ఇష్టపడని వారుండరు. ఇవి రుచికి భలేగా ఉంటాయి. సినిమాలు, వెబ్ సిరీస్ చూసేటప్పుడు లేదంటే ఆఫీసులో పనిచేసేటప్పుడు కొందరు స్నాక్‌గా వీటిని తింటుంటారు. కానీ ప్రతిరోజూ ఆలూ చిప్స తినడం నిజంగా ఆరోగ్యానికి మంచిదేనా? ఆలూ చిప్స తినడం వల్ల శరీరంపై ఎలాంటి ప్రభావాలు ఉంటాయి? ప్రతిరోజూ ఆలూ చిప్స తినడం వల్ల అది శరీరానికి 'స్లో పాయిజన్' లాగా పనిచేస్తుంది. కాబట్టి మీరు ప్రతిరోజూ ఆలూ చిప్స తినే అలవాటు ఉంటే ఇప్పుడే ఆపడం మంచిది. ఎందుకంటే ఇది మీ ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం. ఆలూ చిప్స్‌లో ఉప్పు, అదనపు కొవ్వులు, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. ఇవి అనేక ఆరోగ్య సమస్యలను ఆహ్వానిస్తాయి. ఆలూ చిప్స్‌లో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. నాణ్యమైన కొవ్వులు తక్కువగా ఉంటాయి. ఈ ఆహారాలు సులభంగా జీర్ణం కావు. దీనివల్ల శరీరంలో కొవ్వు పేరుకుపోతుంది. ఫలితంగా బరువు పెరుగుతుంది. ఇది బరువును కూడా పెంచుతుంది. ఆలూ చిప్స్ వేయించడానికి ఉపయోగించే నూనెలో ట్రాన్స్ ఫ్యాట్స్ ఉంటాయి. ఇవి గుండెకు చాలా హానికరం. ఈ కొవ్వులు రక్త నాళాలలో అడ్డంకులను కలిగిస్తాయి. ఇది గుండెపై ఒత్తిడిని కలిగిస్తుంది. ఇది భవిష్యత్తులో గుండె జబ్బుల అవకాశాలను పెంచుతుంది. ఆలూ చిప్స్‌లో అధిక ఉప్పు శాతం వల్ల రక్తపోటును పెంచుతుంది. ఇది గుండె, మూత్రపిండాలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. ఇది అవయవాల పనితీరును కూడా ప్రభావితం చేస్తుంది. ఆలూ చిప్స్‌లో ఎటువంటి పోషకాలు ఉండవు. ఇవి రుచిగా ఉన్నప్పటికీ ఇందులో కేలరీలు, ఉప్పు, కొవ్వులు మాత్రమే ఉంటాయి. కాబట్టి, శరీరానికి అవసరమైన విటమిన్లు, ప్రోటీన్లు, ఫైబర్ లభించదు. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం ఆలూ చిప్స ప్రాసెస్ చేయబడిన ఆహారం కాబట్టి, వాటిని అరుదుగా మాత్రమే తినాలి. నెలలో ఎన్నిసార్లు ఆలూ చిప్స తినాలో నిర్దిష్ట సంఖ్య లేదు. కానీ ప్రతిరోజూ ఆలూ చిప్స తినడం ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదు. మీరు ఆలూ చిప్స తినాలనుకుంటే, నెలకు ఒకటి లేదా రెండుసార్లు తినడం మంచిది. కానీ వాటిని తినేటప్పుడు వీలైనంత తక్కువ పరిమాణంలో మాత్రమే తీసుకోవాలి. మొత్తం ప్యాకెట్‌ను ఒకేసారి తినడానికి బదులుగా, తక్కువ మొత్తంలో తినడం వల్ల ఆరోగ్యానికి పెద్దగా హాని జరగదు. మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఆలూ చిప్స్ బదులుగా ఇతర ఆరోగ్యకరమైన ఆహారాలను తీసుకోవడం అవసరం. అంటే యాపిల్, అరటిపండ్లు, నారింజ, బాదం, వాల్‌నట్స్, శనగలు, వేయించిన మఖానా తినవచ్చు. ఈ ఆహారాలు రుచిగా ఉండటం మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా మంచివి. వీటిని తింటే త్వరగా కడుపు నిండిన భావన కలుగుతుంది. శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. అలాగే ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాలి.



# భారత జాతీయ పతాక తయారీ, నిబంధనలు



భారత జాతీయ పతాకం, దీర్ఘ చతురస్రాకారంలో కాషాయం, తెలుపు, పచ్చ రంగులు సమ నిష్పత్తిలో త్రివర్ణంగా ఉంటూ మధ్యలో 24 ఆకులు కలిగిన నేవీ బ్లూ రంగులో ఉండే చక్రమైన అశోక చక్రంతో ఉంటుంది. 1947 జూలై 22న భారత రాజ్యాంగ పరిషత్ సమావేశంలో ప్రస్తుతం ఉన్న రూపంలో ఆమోదం పొంది, 1947 ఆగస్టు 15న భారత డొమినియన్‌కు అధికారిక పతాకంగా ఆమోదం పొందింది. తర్వాత క్రమేపీ భారత గణతంత్రానికి అధికారిక పతాకంగా స్వీకరించారు. 1951లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స (బి.ఐ.ఎస్.) జాతీయ పతాకానికి కొన్ని నిర్దేశకాలను రూపొందించింది. ఈ నిర్దేశకాలను మన దేశంలో అమల్లోకి వచ్చిన మెట్రిక్ మానానికి సరిపోయేటట్లు 1964లో ఒకసారి, 1968 ఆగష్టు 17న మరొక సారి సవరించారు. పతాక పరిమాణం, రంగులు, వాడే బట్టకు వర్తించే ఈ నిర్దేశకాలు చాలా కచ్చితమైనవి. పతాకం తయారీలో ఖాదీ లేక చేనేత వస్త్రాన్ని మాత్రమే వాడాలి. ఖాదీలో నూలు, పట్టు, ఉన్ని బట్టలను మాత్రమే వాడుతారు. జెండాలో రెండు రకాల ఖాదీని వాడుతారు: జెండా రూపానికి ఖాదీబంటింగ్, జెండాను కఱ్ఱకు తగిలించడానికి అవసరమయ్యే బట్టకు ఖాదీడక్. ఖాదీడక్ ప్రత్యేకమైన పవఅస్త్రవ (పసుపు పచ్చబ్రౌన్ కలిసిన రంగు) రంగులో ఉంటుంది. సాంప్రదాయిక నేతలో రెండు పోగులను వాడేచోట ఖాదీడక్‌లో మూడు పోగులను వాడుతారు. ఇది చాలా అరుదైన నేత. దేశం మొత్తమ్మీద ఈ రకమైన నేతపని తెలిసినవాళ్ళు పదిమంది కంటే ఎక్కువ లేరు. ఇంకా చదరపు సెంటీమీటరుకు కచ్చితంగా 150 పోగులు ఉండాలని, కుట్టుకు నాలుగు పోగులు ఉండాలని, ఒక చదరపు అడుగు గుడ్డ కచ్చితంగా 205 గ్రాములుండాలని నిర్దేశకాలు ఊన్నాయి. జాతీయపతాకాలను ఉత్పత్తిచేయడానికి అవసరమైన ఖాదీ బట్ట ఉత్తర కర్ణాటకలోని ధార్వాడ్, బాగల్కోట్ జిల్లాల్లోని రెండు చేనేత యూనిట్ల నుంచి వస్తుంది. ప్రస్తుతం దేశంలో జాతీయ పతాకాలను తయారు చేయడానికి ప్రభుత్వ అనుమతి గల ఒకే ఒక్క సంస్థ హుబ్లీలో ఉంది. జాతీయ పతాకాలను ఉత్పత్తి చేయడానికి అనుమతి ఇచ్చే అధికారం ఖాదీ డెవలప్‌మెంట్ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ కు ఉన్నప్పటికీ ఆ అనుమతిని రద్దు చేసే అధికారం బి.ఐ.ఎస్.కు ఉంది. నేసిన బట్టను పరీక్ష నిమిత్తం బి.ఐ.ఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్)కు పంపిస్తారు. తిరిగొచ్చిన తర్వాత బ్లీచింగు చేసి రంగులద్ది, మధ్యలో అశోకచక్రాన్ని స్క్రీన్ ప్రింటింగు గానీ, స్టెన్సిల్ గానీ, ఎంబ్రాయిడరీ గానీ చేస్తారు. చక్రం రెండు వైపులా ఒకేచోట స్పష్టంగా కనిపించాలి. జెండాపై వేసిన రంగులను బి.ఐ.ఎస్. పరీక్షించిన తర్వాతే పతాకాలను అమ్మటానికి అనుమతిస్తారు. మన దేశంలో ప్రతి సంవత్సరం దాదాపు నాలుగు కోట్ల జెండాలు అమ్ముడు పోతాయి. దేశంలోనే అతిపెద్ద పతాకం (6.3 ఐ 4.2 మీ) మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యాలయమైన మంత్రాలయ భవనం మీద ఎగురుతుంది. 2002కు ముందు జాతీయ సెలవు దినాల్లో తప్ప మిగతా సమయాల్లో జాతీయ పతాకాన్ని ప్రజలు ఎగరేయడానికి అనుమతించేవారు కాదు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఉన్నతాధికారులకు మాత్రమే ఆ అధికారముండేది. ఈ నిబంధనను తొలగించాలని కోరుతూ నవీన్ జిందాల్ అనే పారిశ్రామికవేత్త ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశాడు. జిందాల్ తన కార్యాలయ భవంతి మీద జాతీయ పతాకాన్ని ఎగురవేయగా అధికారులు దాన్ని స్వాధీనం చేసుకుని, ఆయన్ను ప్రాసిక్యూట్ చేస్తామని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా జాతీయ పతాకాన్ని ఎగరేయడం పౌరుడిగా తన హక్కని, దేశం పట్ల తన ప్రేమను ప్రకటించుకునే మార్గమని జిందాల్ వాదించాడు. ఆ కేసు సుప్రీమ్ కోర్టుకు వెళ్ళింది. సుప్రీమ్‌కోర్టు ఈ విషయాన్ని పరిశీలించడానికి ఒక కమిటీని వేయమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. కేంద్ర మంత్రిమండలి పతాకం గౌరవానికి భంగం కలగని రీతిలో ఎవరైనా జాతీయ పతాకాన్ని ఎగరేయవచ్చని అనుమతిస్తూ జాతీయపతాక నియమావళిని సవరించింది. భారత జెండా కోడ్, జాతీయ చిహ్నాలకు సంబంధించిన ఇతర చట్టాలు జెండా వాడుకకు వర్తిస్తాయి. మొదట్లో ఈ కోడ్ భారత స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వంటి జాతీయ దినోత్సవాల సందర్భంగా తప్ప మిగతా రోజుల్లో సాధారణ పౌరులు జెండాను వాడడం నిషేధించింది. 2002లో నవీన్ జిందాల్ అభ్యర్థన పరిశీలిస్తూ భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సాధారణ పౌరులు జెండాను వాడుకునేందుకు వీలుగా కోడ్‌ను సవరించమని భారత ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. దాన్ని అనుసరించి భారతీయ కేంద్ర మంత్రివర్గం కోడ్‌ను పరిమితంగా వాడేందుకు సాధారణ పౌరులకు వీలునిస్తూ సవరించింది. 2005లో మరోసారి కోడ్‌ను సవరించి కొన్ని రకాల దుస్తుల మీద ఉపయోగించడం సహా మరికొన్ని అదనపు వాడుకలను అనుమతించారు. జెండాను ఎగురవేయడం, ఇతర జాతీయ, సాధారణ జెండాలతో కలిపి భారత జాతీయ పతాకాన్ని వాడేప్పుడు అనుసరించాల్సిన విధానాలకు ఆ కోడ్ వర్తిస్తుంది. ఈ సవరణ 2002 జనవరి 26 న అమల్లోకి వచ్చింది. జాతీయపతాక నియమావళి అనేది చట్టం కానప్పటికీ, ఆ నియమావళి లోని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సుప్రీమ్‌కోర్టు యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ నవీన్ జిందాల్ కేసులో పేర్కొంది. జాతీయ పతాకాన్ని ఎగరేసే హక్కు సంపూర్ణ హక్కు కాదు. పరిమితులతో కూడిన హక్కు. దీన్ని భారతరాజ్యాంగంలోని 51ఎ ఆర్టికల్ లోని ప్రాథమిక విధులతో కలిపి అన్వయించవలసి ఉంటుంది. వాస్తవంగా జెండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 కూడా యూనిఫారాలు, బట్టలు, ఇతర వస్త్రాలపై జెండా వినియోగాన్ని ఒప్పుకోదు. జూలై 2005 లో, భారతదేశం ప్రభుత్వం కొన్ని రకాల వినియోగాన్ని అనుమతించటానికి సవరించారు. సవరించిన కోడ్ ప్రకారంలో దుస్తులలో జెండా వాడుక నిషేధిస్తుంది. పిల్లో కవర్స్, చేతి రుమాలు లేదా ఇతర వస్త్రాలు పై ఎంబ్రాయిడరీ డిజైన్స్ నిషేధిస్తుంది. దెబ్బతిన్న జెండాలు లేదా పాడయి పోయిన జండాలు నాశనము చేయడానికి ఒక ప్రత్యేక పద్ధతి ఉంది. పాడయిన లేదా చిరిగిపోయిన జెండాలను పక్కన పడెయ్యటం లేదా అగౌరవంగా నాశనం చేయకూడదు. అలాంటి వాటిని కాల్చడము /తగులబెట్టడం లేదా భూమిలో పాతిపెట్టడం చేయాలి. లేదా జెండా గౌరవాన్ని కాపాడే మరే ఇతర పద్ధతి ద్వారా మాత్రమే వాటిని నాశనము చేయాలి.

# శ్రామిక గమనశీలతతోనే ఎక్కువ ఉపాధి



ఆర్థిక పరిభాషలో శ్రామిక గమనశీలత అంటే కార్మికులు వివిధ ఉద్యోగాలు (వృత్తి గమనశీలత) లేదా విభిన్న భౌగోళిక స్థానాల (భౌగోళిక గమనశీలత) మధ్య సులభంగా వెళ్ళగలగడం. ఈ కీలకమైన భావన ఆర్థిక వ్యవస్థలో శ్రమవనరులు ఎంత సమర్థవంతంగా కేటాయించబడుతున్నాయో తెలపడంతోపాటు, ఉత్పాదకత, ఆర్థికవృద్ధి వంటి అంశాలను ప్రభావితం చేస్తుంది. విద్య, శిక్షణ, సామాజిక, కుటుంబ సంబంధాలు, గృహ ఖర్చుల లభ్యత, ప్రభుత్వ విధానాలు మొదలైన అనేక అంశాలు శ్రామిక గమనశీలతను ప్రభావితం చేస్తాయి. తక్కువ శ్రామిక గమనశీలత కొన్ని ప్రాంతాలలో నిరంతర నిరుద్యోగం, ఇతర ప్రాంతాలలో కార్మిక కొరతలకు దారితీస్తుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) 2024 అంచనాల ప్రకారం, 2022లో ప్రపంచవ్యాప్తంగా 167.7 మిలియన్ల అంతర్జాతీయ వలస కార్మికులు ఉన్నారు. వారు ప్రపంచ శ్రామికశక్తిలో 4.7%. ప్రపంచ అంతర్జాతీయ వలస జనాభాలో 15 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయస్సు గల కార్మికులు దాదాపు 66% ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా వృత్తిపరమైన గమనశీలతను ప్రభావితంచేసే అంశాలు చూసినప్పుడు నైపుణ్యాలు, విద్య, వేతన వ్యత్యాసాలు, శిక్షణ అవకాశాలు, బదిలీ నైపుణ్యాలు, వృత్తిపరమైన నిబంధనలు, పని వాతావరణాలకు అనుగుణంగా ఉండే సామర్థ్యం మొదలైనవి. మరోవైపు భౌగోళిక గమనశీలతను వేతన వ్యత్యాసాలు, జీవన వ్యయం, గృహనిర్మాణం, మార్కెట్, సామాజిక, సాంస్కృతిక సంబంధాలు, ప్రభుత్వ విధానాలు, రాజకీయ స్థిరత్వం, పౌరస్వేచ్ఛలు, వాతావరణం, ప్రకృతి వైపరీత్యాలు, సాంకేతిక పురోగతి మొదలైనవి ప్రభావితం చేస్తాయి. విజువల్ క్యాపిటలిస్ట్ ప్రచురించిన డేటా ప్రకారం ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో అంతర్జాతీయ వలసదారులు అమెరికాలో 52.4 మిలియన్లకు పైగా ఉన్నారు. దీని వలన అది అధిక గమనశీలత కలిగిన దేశంగా మారింది. మెక్సికో, అమెరికా వలస కారిడార్ ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉంది. మెక్సికోలో జన్మించిన 10 మిలియన్లకు పైగా ప్రజలు మైగ్రేషన్ డేటా పోర్టల్ ప్రకారం అమెరికాలో నివసిస్తున్నారు. యునైటెడ్ కింగ్‌డమ్ కూడా వలస కార్మికుల రాకపోకలలో గణనీయమైన పెరుగుదలను చూసింది. 2023లో 2,83,000 మంది వలస కార్మికులు వచ్చారు. ఇది మునుపటి సంవత్సరం కంటే 48% ఎక్కువ. కెనడా కూడా అధిక స్థాయిలో శ్రామిక గమనశీలత అనుభవిస్తోంది, 2023లో 1,45,000 మంది వలస కార్మికులు వచ్చారు, ఇది 7% ఎక్కువ. ఇతర ముఖ్యమైన దేశాలు జర్మనీ, జపాన్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా కూడా వలస కార్మికులను ఆకర్షించడంలో బలమైన ధోరణులను చూపిస్తున్నాయి.

వాస్తవానికి, పోటీతత్వ ప్రపంచ శ్రామికశక్తికి కార్మిక మార్కెట్ సరళత చాలా అవసరం. ఎందుకంటే ఇది ఉద్యోగ సృష్టిని ప్రోత్సహిస్తుంది. విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తుంది. శ్రామిక శక్తి గమనశీలతను పెంచుతుంది. కార్మిక సంస్కరణలను అమలు చేసిన దేశాలు ఆర్థిక వృద్ధిలో గణనీయమైన మెరుగుదలను చూపిస్తున్నాయి. సౌకర్యవంతమైన కార్మిక విధానాలను కలిగి ఉన్న దేశాలు మార్కెట్ డిమాండ్లకు బాగా సర్దుబాటు చేయగలవు, మాంద్యాలను తగ్గించగలవు. మరింత స్థితిస్థాపక ఆర్థిక వ్యవస్థను పెంపొందించగలవు. పైగా ఈ దేశాలు వేగవంతమైన నియామకం, మెరుగైన పోటీతత్వం, సాంస్కృతిక నిరోధకత, ఆర్థిక వృద్ధి, ఉద్యోగసృష్టి వంటి ప్రయోజనాలను కూడా కలిగి ఉన్నాయి. 2025లో ఉద్యోగ సౌలభ్యం, ఉపాధి ఒప్పందాలు, వేతన సరళత ఆధారంగా, మొదటి ఐదు దేశాలు 96/100 స్కోరుతో డెన్మార్క్, 95/100 స్కోరుతో సింగపూర్, 94/100 స్కోరుతో యునైటెడ్ స్టేట్స్, 92/100 స్కోరుతో న్యూజిలాండ్, 80/100 స్కోరుతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ). కార్మిక మార్కెట్ సరళత విషయానికి వస్తే ఈ దేశాలు ముందున్నాయి. ఐక్యరాజ్య సమితి (యుఎన్ఓ) వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్ట్స్ 2024 డేటా ఆధారంగా, 2023లో అత్యధిక నికర వలస రేట్లు కలిగిన మొదటి ఐదు దేశాలు, పాకిస్తాన్ 1.62 మిలియన్లు, సూడాన్ 1.35 మిలియన్లు, భారతదేశం 979,000, చైనా 568,000 బంగ్లాదేశ్ 550,000. అనేక దేశాలు తమ పౌరులు ఇతర దేశాలకు వలస వెళ్లడం వల్ల స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)లో తగ్గుదలని ఎదుర్కొంటున్నాయి. వీటిలో భారతదేశం, చైనా ఎక్కువ జనాభాను కలిగి ప్రభావితమయ్యాయి. ఈ దేశాల పౌరులు గణనీయమైన సంఖ్యలో వలస వెళ్తున్నారు, దీని వలన సమర్థ శ్రామిక శక్తి, మానవ మూలధనం కోల్పోతున్నారు. భారతదేశంలో భౌగోళిక (ప్రాంతాల వారీగా గమనశీలత), వృత్తిపరమైన (ఉద్యోగాలు/ వృత్తుల వారీగా గమనశీలత) రెండూ సాంప్రదాయకంగా చాలా తక్కువగా ఉన్నాయి. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే ప్రధాన కారణాలు కులవ్యవస్థ, కుటుంబ, సమాజ బంధాలు, భాష, ప్రాంతీయ తేడాలు వంటి సామాజిక, సాంస్కృతిక అంశాలు, తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, వలస ఖర్చు వంటి ఆర్థిక పరిమితులు ఉన్నాయి. దీనికి అదనంగా పట్టణ గృహనిర్మాణం, పట్టణ మురికివాడ పరిస్థితులు, విద్య, నైపుణ్య అడ్డంకులు, నైపుణ్య అసమతుల్యత మొదలైనవి భారతదేశంలో కార్మికుల గమనశీలతను ప్రభావితం చేస్తున్నాయి. అశోక విశ్వవిద్యాలయం స్టాటిస్టా డేటా ప్రకారం, హిమాచల్‌ప్రదేశ్ జనాభాలో 45.7% వలసదారులతో ముందంజలో ఉంది. ఇతర ప్రముఖ రాష్ట్రాలు కేరళ 38.4%, తెలంగాణ 37.1%, పంజాబ్ 35.8%, మహారాష్ట్ర 35.6% వలస జనాభాతో ఉన్నాయి. ప్రత్యేకంగా ఉపాధి కోసం కదలికను కొలిస్తే, కొన్ని చిన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు అధిక శాతాన్ని చూపిస్తున్నాయి, అవి అరుణాచల్ ప్రదేశ్ నుండి 31.2% వలసదారులు పని కోసం తరలివెళుతున్నారు, మిజోరం 30.3%, ఢల్లీ 28.6%, నాగాలాండ్ 27.5%. వలస కార్మికుల కోసం ప్రధాన గమ్యస్థాన రాష్ట్రాలను చూసినప్పుడు మహారాష్ట్ర 7.9 మిలియన్ల అంతర్ రాష్ట్ర వలస కార్మికులను కలిగి ఉంది, తమిళనాడు 3.48 మిలియన్ల మంది కార్మికులు కర్ణాటక 2.88 మిలియన్లు గుజరాత్ 3 మిలియన్లు. ఢల్లీ 2.03 మిలియన్లు, కేరళ 0.7 మిలియన్లకుపైగా అంతర్‌రాష్ట్ర వలస కార్మికులను కలిగి ఉంది. భారతదేశంలో మరిన్ని ఉపాధి అవకాశాల కోసం కార్మిక గమనశీలతను పెంచడానికి చర్యలు తీసుకోవాలి. కార్మికుల గమనశీలతను పెంచడం నిరుద్యోగ భారాన్ని తగ్గిస్తుంది కాబట్టి కార్మికుల గమనశీలతపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి.



## 304 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్, 132 పాయింట్లు పెరిగిన నిఫ్టీ

దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం ఎనిమిదేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోవడం భారత స్టాక్ మార్కెట్లకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. ఈ సానుకూల పరిణామంతో బుధవారం నాటి ట్రేడిరగ్‌లో సూచీలు లాభాలతో కళకళలాడాయి. ముఖ్యంగా మిడ్‌క్యాప్ షేర్లలో అనూహ్యమైన కొనుగోళ్ల మద్దతు లభించడంతో మార్కెట్లు లాభాలతో ముగిశాయి. ట్రేడిరగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 304 పాయింట్ల లాభంతో 80,539.91 వద్ద స్థిరపడిరది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 131.95 పాయింట్లు పెరిగి 24,619.35 వద్ద ముగిసింది. సానుకూల ద్రవ్యోల్బణ గణాంకాలతో ఉదయం సెషన్ నుంచే సూచీలు లాభాల్లో పయనించాయి. వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం ఈ ఏడాది జులైలో 1.55 శాతానికి పడిపోయింది. ఆహార పదార్థాల ధరలు తగ్గడమే ఇందుకు ప్రధాన కారణం. 2017 జూన్ తర్వాత ఇంత తక్కువ స్థాయిలో ద్రవ్యోల్బణం నమోదు కావడం ఇదే తొలిసారి. ద్రవ్యోల్బణం తగ్గడంతో ఆటో, మెటల్ వంటి రంగాల్లో కొనుగోళ్ల ఆసక్తి పెరిగిందని, దీనివల్ల మార్కెట్లలో సానుకూల వాతావరణం నెలకొందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. "మిడ్‌క్యాప్ షేర్లు అద్భుతమైన పనితీరు కనబరిచాయి. అంతర్జాతీయంగా చైనా టారిఫ్ గడువు పొడిగింపు, తగ్గుతున్న చమురు ధరలు కూడా సెంటిమెంట్‌కు మద్దతు ఇచ్చాయి" అని ఆయన వివరించారు. సెన్సెక్స్ ప్యాక్‌లో బీఈఎల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్, కోటక్ బ్యాంక్, పవర్ గ్రిడ్, ఏషియన్ పెయింట్ షేర్లు లాభపడగా.. ఐటీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్ నష్టపోయాయి. నిఫ్టీ ఆటో సూచీ 1.12 శాతం పెరిగింది. మరోవైపు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ కూడా బలపడిరది. రూపాయి 23 పైసలు లాభపడి 87.51 వద్ద ముగిసింది. ఆగస్టు 15న అమెరికా, రష్యా అధ్యక్షుల మధ్య జరగనున్న సమావేశంపై సానుకూల అంచనాలు, అలాగే భారత్, అమెరికాలో ద్రవ్యోల్బణం తగ్గడం వంటి అంశాలు రూపాయికి కలిసొచ్చాయని ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌కు చెందిన జతీన్ త్రివేది పేర్కొన్నారు.

# వెండి నగలు కొంటున్నారా.. ఒకటో తేదీ నుంచి కొత్త రూల్స్

భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల్లో బంగారానికి ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా మహిళలు బంగారు ఆభరణాలు ధరిస్తారు. బంగారం తర్వాత ఆ స్థానాన్ని వెండి భర్తీ చేస్తోంది. బంగారంతో పాటు వెండి నగలు సైతం ధరిస్తుంటారు. అయితే, బంగారం మాదిరిగానే వెండికి సైతం నిబంధనలు అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. ఈ మేరకు వెండి ఆభరణాలకు సైతం హాల్ మార్కింగ్ తప్పనిసరి చేసే కొత్త రూల్స్ అమలు చేయనుందని పలు నివేదికలు చెబుతున్నాయి. సెప్టెంబర్ 1, 2025 నుంచి వెండి నగలకు హాల్ మార్కింగ్ ఉండే విధానం అమలులోకి తీసుకురాబోతున్నారని నివేదికలు చెబుతున్నాయి. ఇది ఇప్పటికే బంగారానికి అమలు చేసిన విధానం మాదిరిగా ఉంటుందని సమాచారం. భారతీయ ప్రామాణిక బ్యూరో ప్రకారం వెండి నగలకు 900, 800, 835, 925, 970, 990 అనే ఆరు రకాల ప్యూరిటీ స్థాయిలను నిర్ధారించనున్నారు. వెండి ఆభరణాల స్వచ్ఛతను బట్టి ప్రత్యేకంగా ఉండే 6 అంకెల హాల్ మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ జారీ చేయనున్నారు. ప్రతి నగపై ఈ హాల్ మార్క్ ముద్రిస్తారు. ఈ కొత్త విధానం ప్రస్తుతం అమలవుతున్న హాల్ మార్కింగ్ విధానాన్ని భర్తీ చేయనుంది. కేంద్ర ప్రభుత్వం బంగారం హాల్ మార్కింగ్‌ను తప్పనిసరి చేస్తూ 2021లో ఆదేశాలు జారీ చేసింది. హాల్ మార్కింగ్ అంటే విలువైన లోహాల ఆభరణాలలో లోహపు స్వచ్ఛతను తెలియజేస్తుంది. స్వచ్ఛతను అధికారికంగా నమోదు చేసే ఒక ప్రత్యేక ప్రక్రియ. భారత్‌లో బీఐఎస్ హాల్ మార్కింగ్ అనేది ఆభరణాలు చట్టబద్ధమైన స్వచ్ఛత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని నిర్ధారిస్తుంది. సెప్టెంబర్ 1, 2025 నుంచి వెండి ఆభరణాలకు హాల్ మార్కింగ్ స్వచ్ఛందం కానుంది. బంగారానికి అమలు చేసిన మాదిరిగానే ఉంటుంది. ప్రతి నగపై 6 అంకెలతో కూడిన నఖIఆ నంబర్ ముద్రిస్తారు. దాని ద్వారా ఆ నగ స్వచ్ఛత తెలుసుకోవచ్చు. కొనుగోలుదారులు బీఐఎస్ కేర్ యాప్‌లో వెరిఫై నఖIఆ ఫీచర్ ద్వారా ఆభరణాల స్వచ్ఛతను తనిఖీ చేయవచ్చు. దీంతో హాల్ మార్క్ లేని, నకిలీ, కల్తీ ఉత్పత్తుల నుంచి రక్షణ పొందవచ్చు. బంగారం నగలకు 999, 970 అంటూ ప్యూరిటీ నిర్ధరిస్తారు. బంగారు ఆభరణాలు తయారు చేసిన తర్వాత కచ్చితంగా హాల్ మార్క్ ముద్రించాల్సి ఉంటుంది. కొనుగోలు చేసే ముందు ఈ హాల్ మార్క్ తనిఖీ చేయాలి. దానిపైనే నగకు సంబంధించిన పూర్తి వివరాలు ఉంటాయి. ప్రత్యేకమైన నంబర్ సాయంతో తనిఖీ చేయవచ్చు.



## ఓన్లీ పేరుతో యాప్ ను ప్రారంభించిన ర్యాపిడో

బైక్ టాక్సీ ప్లాట్‌ఫామ్ ర్యాపిడో ఫుడ్ డెలివరీ రంగంలోకి ప్రవేశించింది. ప్రస్తుతం రైడ్ సేవలు అందిస్తున్న ర్యాపిడో యాప్, వ్యాపార విస్తరణలో భాగంగా ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ రంగంలోకి అడుగుపెట్టింది. ఇందుకోసం 'ఓన్లీ' పేరుతో ఒక యాప్‌ను ప్రారంభించింది. ప్రస్తుతం బెంగళూరులో ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. ఈ నేపథ్యంలో వావ్, ఈట్ ఫిట్, క్రిస్పీ, క్రీం వంటి బ్రాండ్లతో ర్యాపిడో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్లాట్‌ఫామ్‌పై చాలా వరకు ఆహార పదార్థాల ధరలు రూ.150 లోపే ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ మార్కెట్‌లో జొమాటో, స్విగ్గీ ప్లాట్‌ఫామ్‌లు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ విభాగంలో గట్టి పోటీ ఇచ్చేందుకు ర్యాపిడో సిద్ధమైంది. రెస్టారెంట్ల నుంచి కేవలం 8-15 శాతం కమీషన్ మాత్రమే వసూలు చేయడం ద్వారా ఈ రంగంలో రాణించాలని ర్యాపిడో భావిస్తోంది. 2015లో బైక్ ట్యాక్సీ ప్లాట్‌ఫామ్‌గా తన కార్యకలాపాలు ప్రారంభించిన ర్యాపిడో, ఒక దశాబ్ద కాలంలోనే దేశంలో రైడ్ షేరింగ్ రంగంలో రెండవ స్థానాన్ని ఆక్రమించింది. 500కు పైగా నగరాల్లో ర్యాపిడో సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే తన బైక్ సేవలను ఉపయోగించి వ్యక్తిగత రెస్టారెంట్లకు డెలివరీ సేవలను ర్యాపిడో అందిస్తోంది.




## ఇకపై 4 గంటల్లో చెక్కుల క్లియరెన్స్

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్లకు భారీ గుడ్ న్యూస్ తెలిపింది. చెక్కుల క్లియరెన్స్ సమయాన్ని రెండు రోజుల నుంచి కేవలం 4 గంటలకు తగ్గిస్తూ కొత్త విధానాన్ని ప్రవేశపెడుతోంది. చెక్ ట్రంకేషన్ సిస్టమ్‌ను బ్యాచ్ ప్రాసెసింగ్ నుంచి ఆల్వేస్ క్లియరింగ్, 'ఆన్-రియలైజేషన్-సెటిల్‌మెంట్' విధానానికి మార్చనుంది. ఈ కొత్త విధానం రెండు దశల్లో అమలు కానున్నట్టు పేర్కొంది. మొదటి దశ(అక్టోబర్ 4, 2025 - జనవరి 2, 2026)లో ఉదయం 10:00 నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు ఒకే ప్రెజెంటేషన్ సెషన్ ఉంటుంది. బ్యాంక్ బ్రాంచ్‌లకు వచ్చిన చెక్కులను వెంటనే స్కాన్ చేసి క్లియరింగ్ హౌస్‌కు పంపాలి. డ్రా కావాల్సిన చెక్కులను బ్యాంకులు సాయంత్రం 7:00 గంటలలోపు ఆమోదించాలి లేదా తిరస్కరించాలి. లేకపోతే అవి ఆమోదించబడినట్లు భావించి సెటిల్‌మెంట్‌కు చేర్చబడతాయి. రెండవ దశ(జనవరి 3, 2026)లో చెక్కుల గడువు సమయం3 గంటలకు మారుతుంది. అనగా ఉదయం 10:00 నుంచి 11:00 గంటల మధ్య వచ్చిన చెక్కులను




మధ్యాహ్నం 2:00 గంటలలోపు ఆమోదించాలి లేదా తిరస్కరించాలి. సెటిల్‌మెంట్ పూర్తయిన తర్వాత, క్లియరింగ్ హౌస్ ఆమోదం/తిరస్కరణ సమాచారాన్ని ప్రెజెంటింగ్ బ్యాంక్‌కు పంపుతుంది. ప్రెజెంటింగ్ బ్యాంక్ ఈ సమాచారాన్ని ప్రాసెస్ చేసి, ఒక గంటలోపు కస్టమర్‌కు విడుదల చేయాలి. చెక్కుల క్లియరెన్స్ సామర్థ్యాన్ని మరింత పెంచడం, సెటిల్‌మెంట్ రిస్క్‌ను తగ్గించడమే లక్ష్యంగా ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మార్పుల గురించి బ్యాంకులు తమ కస్టమర్లకు అవగాహన కల్పించాలని ఆర్‌బీఐ ఆదేశించింది.

శుక్రవారం-15- ఆగస్టు 2025

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# తెలంగాణ ప్రజాపాలనలో మెరిసిన ధృవతార పొంగులేటి

- నిజాయితీతో నడిచిన నాయకుడు
- భూభారతి ఒక చారిత్రాత్మక విప్లవం
- ఇందిరమ్మ ఇండ్లతో పేదల స్వప్నం సాకారం
- పారదర్శకతకు పెట్టింది పేరు పొంగులేటి
- రాష్ట్ర ప్రభుత్వంలో కీలక పాత్ర
- ప్రజలతో మమేకం...సామాజిక న్యాయానికి నిబద్ధత
- రాజకీయ సమీకరణాలనే మార్చిన యోధుడు



**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రాష్ట్రంలో ప్రజాకర్షక నాయకుడిగా, రాజకీయ సమీకరణాలను మార్చిన యోధుడిగా, ప్రజల సమస్యల పరిష్కారంలో కీలక పాత్రధారిగా రాణిస్తున్న రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచారం మరియు పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గురించి ఈ ప్రత్యేక కథనం. ఆయన నాయకత్వంలో రెవెన్యూ మరియు గృహ నిర్మాణ రంగాలు ప్రగతి పథంలో దూసుకెళ్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి వంటి కార్యక్రమాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు, నిరుపేదలకు ఆసరాగా నిలుస్తూ, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా సాగుతోంది.

## పారదర్శకతకు పెట్టింది పేరు

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజాపాలనలో పారదర్శకత, నిజాయితీకి మారుపేరు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు రాలేదన్న ఫిర్యాదులపై వెంటనే విచారణకు ఆదేశించారు. అవినీతికి ఆస్కారం లేకుండా, అత్యంత పేదలైన ఒంటరి మహిళలు, వికలాంగులు, వితంతువులకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ శాఖలో గత ప్రభుత్వం విధ్వంసం చేసిన వ్యవస్థలను సరిచేసేందుకు, ప్రతి గ్రామంలో ఒక రెవెన్యూ అధికారిని నియమించాలని నిర్ణయించారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం 80.54 లక్షల దరఖాస్తులు రాగా, వీటిని డిసెంబర్ 5, 2024న ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్లు మొబైల్ యాప్ ద్వారా పరిశీలిస్తున్నారు. ఈ యాప్ ద్వారా 32 లక్షల దరఖాస్తుల సమాచారం నమోదై, జనవరి మొదటి వారంలో అన్ని దరఖాస్తుల పరిశీలన పూర్తవుతుందని ఆయన తెలిపారు. ఈ పథకంలో అర్హుల ఎంపిక కోసం గ్రామ సభలు, వార్డు సభలు, ఏఐ ఆధారిత 360 డిగ్రీ తనిఖీ వంటి నాలుగు దశల పరిశీలన విధానం అమలవుతోంది.

## రాష్ట్ర ప్రభుత్వంలో కీలక పాత్ర

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇళ్లు ఒక ముఖ్యమైన హామీ. ఈ హామీని నెరవేర్చేందుకు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో 474 ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి స్థలాలను గుర్తించి, అదిలాబాద్, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్ వంటి జిల్లాల్లో నిర్మాణాలు ప్రారంభమయ్యాయి.

అంతేకాక, వరదలు, ఇతర ప్రకృతి విపత్తుల నిర్వహణలోనూ ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (TGSDMA) పునర్గఠన తర్వాత, కృష్ణా, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో విపత్తు సన్నద్ధతను పటిష్ఠం చేసేందుకు ఆయన చర్యలు తీసుకుంటున్నారు.

## ప్రజలతో మమేకం(సామాజిక న్యాయానికి నిబద్ధత)

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన నియోజకవర్గమైన పాలేరులోనే కాక, రాష్ట్రవ్యాప్తంగా ప్రజలతో నేరుగా మమేకమవుతూ, వారి సమస్యలను వినేందుకు, పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటారు. ఆయన ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సులు, గ్రామ సభలు ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేశాయి. ఆయన చేస్తున్న కృషి ఫలితంగా, వరంగల్ వెస్ట్‌లో 592 ఇళ్లు, ఖమ్మం జిల్లాలో 564 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు లబ్ధిదారులకు అందజేయబడ్డాయి.

సామాజిక న్యాయం పట్ల ఆయన చూపిస్తున్న నిబద్ధత, పేదలకు ఇళ్లు, భూమి లేనివారికి ఆసరా, రైతులకు భూ సమస్యల పరిష్కారం వంటి చర్యల ద్వారా స్పష్టమవుతోంది. గత ప్రభుత్వంలో అవినీతి, నిర్లక్ష్యంతో స్తంభించిన రెవెన్యూ, గృహ నిర్మాణ రంగాలను పునరుద్ధరించి, ప్రజలకు న్యాయం చేసే దిశగా ఆయన నడిపిస్తున్నారు.




## భూ భారతి ఒక విప్లవం

తెలంగాణ రాష్ట్రంలో దశాబ్దాలుగా సాగుతున్న భూ సమస్యలకు చెక్ పెట్టేందుకు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో 'భూ భారతి' చట్టం ఒక విప్లవాత్మక చర్యగా రూపొందింది. ఈ చట్టం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 8.58 లక్షల భూ సమస్యల దరఖాస్తులు స్వీకరించబడ్డాయి, వీటిని పరిష్కరించేందుకు రెవెన్యూ శాఖ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారు. గత ప్రభుత్వం రద్దు చేసిన విఆర్ఓ, విఆర్ఏ వ్యవస్థను పునరుద్ధరించి, గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఆయన చేస్తున్న కృషి గమనార్హం. భూ భారతి చట్టం ఏప్రిల్ 17, 2025 నుంచి నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా అమలై, మే 5 నుంచి 28 మండలాలకు,అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించింది. ఈ చట్టం ద్వారా రైతులు, పేదల భూ సమస్యలను ఉచితంగా పరిష్కరించేందుకు అవకాశం కల్పించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో పారదర్శకత, సమర్థతను తీసుకొచ్చేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు ప్రజల నుంచి విశేష స్పందన పొందుతున్నాయి.



## నిజాయితీతో నడిచిన నాయకుడు

1965 అక్టోబర్ 28న ఖమ్మం జిల్లాలోని నారాయణపురంలో జన్మించిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తన రాజకీయ జీవితాన్ని సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితం చేశారు. 2014లో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించి, పార్లమెంటు సభ్యుడిగా సేవలందించారు. ఆ తర్వాత, 2023లో కాంగ్రెస్ పార్టీలో చేరి, పాలేరు నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిచారు. డిసెంబర్ 7, 2023 నుంచి రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన, తన నిర్ణయాలు, చిత్తశుద్ధితో ప్రజల మనసు గెలుచుకున్నారు.



## "ఇందిరమ్మ ఇండ్లతో" పేదల స్వప్నం సాకారం

తెలంగాణ ప్రజలకు సొంత ఇల్లు అనే కలను సాకారం చేసేందుకు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో 'ఇందిరమ్మ ఇళ్లు' పథకం అమలవుతోంది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా, 2025లో 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేశారు. ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లు, గిరిజన ప్రాంతాల్లో 500-700 ఇళ్లు, చెంచు కుటుంబాలకు 10,000 ఇళ్లు మంజూరు చేయడం ద్వారా పేదలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ పథకం కింద భూమి ఉన్నవారికి రూ.5 లక్షల ఆర్థిక సాయం, భూమి లేనివారికి గ్రామాలు, మండల కేంద్రాల్లో ఇందిరమ్మ గృహ కాలనీల నిర్మాణం జరుగుతోంది. ఉచితంగా 40 టన్నుల ఇసుక సరఫరా, స్టీల్, సిమెంట్ వంటి నిర్మాణ సామగ్రిని సబ్సిడీ ధరల్లో అందించే ఏర్పాట్లు చేశారు. ప్రతి సోమవారం నిధుల విడుదల, అర్హత లేని వారి ఇళ్ల నిర్మాణ రద్దు, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద మోడల్ ఇళ్ల నిర్మాణం వంటి కఠిన చర్యలతో పథకం పారదర్శకతను నిర్ధారిస్తున్నారు. ములుగు జిల్లాలో 9,800 చెంచు కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయడం, అదనంగా 1,000 ఇళ్లను ఆమోదించడం వంటి చర్యలు ఆయన సామాజిక న్యాయం పట్ల నిబద్ధతను చాటుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన 1,52,000 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో 63,000 మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన వాటిని పూర్తి చేసేందుకు బాధ్యతలు లబ్ధిదారులకు అప్పగించి, అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నారు.





## తెలంగాణ ప్రగతిలో ఒక శక్తి

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన నిజాయితీ, ప్రజాకేంద్రిత విధానాలతో తెలంగాణ ప్రజాపాలనలో ఒక ధృవతారగా రాణిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి వంటి పథకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు, నిరుపేదలకు ఆసరాగా నిలిచేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయం. రాష్ట్రంలో రెవెన్యూ, గృహ నిర్మాణ రంగాలు ఆయన ఆధ్వర్యంలో ప్రగతి బాటలో దూసుకెళ్తున్నాయి. ఈ కృషి కొనసాగితే, తెలంగాణ ప్రజల కలలు సాకారమవడం ఖాయం!

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in